Email:prajamantalu@gmail.com www.prajamantalu.com

# ప్రజా మంటలు

సంపుటి : 4 సంచిక : 174

పేజీలు - 8 వెల- రూ 5:00

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

శనివారం 17, ఫిబ్రవరి-2024


## కొమురవెల్లి రైల్వే స్టేషన్‌కు కిషన్ రెడ్డి శంకుస్థాపన



2లో..


Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri


## రైతులు ఢిల్లీ చలో అపశ్రుతి



### నిరసనలో మృతి చెందిన రైతు

న్యూఢిల్లీ-ఫిబ్రవరి16 పంటలకు కనీస మద్దతు ధరపై చట్టం చేయాలని కోరుతూ రైతులు ఢిల్లీ చలో కార్యక్రమంతో నిరసనకు ఢిల్లీ బాటపట్టారు. ఈ ఆందోళనకు మద్దతుగా ఫిబ్రవరి 16న సంయుక్త కిసాన్ మోర్చా.. గ్రామీణ భారత్ బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ పిలుపుకు పలు పార్టీలు, సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ నిరసనలో పాల్గొన్న వృద్ధ రైతు గుండెపోటుతో మరణించాడు.పంజాబ్-హర్యానా సరిహద్దులోని శంభులో రైతులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అన్నదాతలు అక్కడకి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఓ వృద్ధ రైతు(78)కు గుండెపోటు రావడంతో.. 4 గంటల సమయంలో రాజ్‌పురాలోని ప్రభుత్వ ఆసుపత్రికి తిసుకెళ్లారు. అక్కడి నుంచి పాటియాలాలోని ప్రభుత్వ రాజింద్ర ఆసుపత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ రాజింద్ర ఆసుపత్రిలో రైతు మరణించాడు. మృతుడు పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లాకు చెందిన జ్ఞాన్ సింగ్‌గా గుర్తించారు. ఇప్పుడే కాదు అంతకు ముందు నిరసనలో మిగతా 2లో..

## దళిత బంధు పథకాన్ని కొనసాగిస్తాం

- ఎస్సీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది
- అభయహస్తం కింద రూ.1,000 కోట్ల బడ్జెట్ కేటాయింపు
- త్వరలోనే విధివిధానాలు రూపకల్పన
- దళిత బంధుపై అసెంబ్లీలో భట్టి కీలక ప్రకటన



హైదరాబాద్,ఫిబ్రవరి16 : ఎస్సీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, దళిత బంధు పథకాన్ని కొనసాగిస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అభయహస్తం కింద రూ.1,000 కోట్ల బడ్జెట్ కేటాయింపులు జరిగాయని, విధివిధానాలు రూపొందించిన తర్వాతే పథకాన్ని ముందుకు తీసుకువెళతామని చెప్పారు. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్నలకు అసెంబ్లీలో భట్టి సమాధానమిస్తూ.. ప్రభుత్వం ఎస్సీల సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చినందున ఈ బడ్జెట్‌లో రూ.1000 కోట్లు కేటాయించిందన్నారు. కేటాయింపులు చేసినా గత ప్రభుత్వం రూ.17 వేల కోట్ల నిధులు విడుదల చేయడంలో విఫలమైందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇందిరమ్మ గృహాలు, బడ్జెట్ కేటాయింపులపై భట్టి మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో ప్రభుత్వం తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రతిపక్ష నేతల సూచనలను స్వాగతించిన డిప్యూటీ సీఎం, యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ ముందు ఉంటుందని , ఈ క్రమంలోనే టీఎస్‌పీఎస్సీ ప్యానెల్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. కమిషన్‌కు అవసరమైన సిబ్బందిని నియమించిన తర్వాత నోటిఫికేషన్‌లు జారీ చేస్తామని చెప్పారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం రూ.7,11,911 కోట్ల బడ్జెట్‌యేతర అప్పులు చేసిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై ప్రతిపక్షాలకు ఇచ్చిన సమాధానంలో, మొత్తం ఆరు హామీలను అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్దంగా ఉందని.. FRBM పరిమితుల ప్రకారం రుణం తీసుకోవాలన్నారు. అలాగే గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులను తీర్చాలని చెప్పారు. రైతు భరోసాకు రూ.15,075 కోట్లు, ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకానికి రూ.7,740 కోట్లు, గృహజ్యోతికి రూ.2,418 కోట్లు, మహాలక్ష్మి గ్యాస్‌కు రూ.723 కోట్లు సహా ఆరు హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.53,196 కోట్లు కేటాయించిందని భట్టి తెలిపారు.

## ఎన్నికల ముందు కాంగ్రెస్‌కు షాక్



### కాంగ్రెస్ పార్టీ అకౌంట్లు ఫ్రీజ్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి16 : దేశంలో సార్వత్రిక ఎన్నికల ముందు ప్రధాన ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్‌కు ఊహించని షాక్ తగిలింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన బ్యాంకు అకౌంట్లు అన్ని ఫ్రీజ్ అయ్యాయి. పన్ను చెల్లించలేదన్న కారణంగానే అకౌంట్లను ఫ్రీజ్ చేసినట్లు కాంగ్రెస్ నేత కోశాధికారి అజయ్ మాకెన్ వెల్లడించారు. ఈ చర్యను రాజకీయ కుట్రగా అభివర్ణించారు. న్యాయ పోరాటం చేస్తామని ప్రకటించారు. మిగతా 3లో..

## ఏసీబీకి చిక్కిన మరో అవినీతి అధికారి

నల్లగొండ,ఫిబ్రవరి16 : నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ రూ.3 లక్షలు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఫిబ్రవరి 16న శుక్రవారం పట్టుకున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి సూపరింటెండెంట్ డాక్టర్ లావుడ్య లచ్చు నల్గొండలోని తన నివాసంలో మెడికల్ డిస్ట్రిబ్యూటర్ రాపోలు వెంకన్న (ఫిర్యాదుదారు) నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడిని అరెస్టు చేసి త్వరలో ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి 2 సంవత్సరాలుగా మెడిసిన్ సరఫరా చేస్తున్నట్లు వెంకన్న వెల్లడించారు. కొన్నాళ్లుగా సూపరింటెండెంట్ 10 శాతం కమీషన్ తీసుకుంటున్నారని, ఇటీవల ఎక్కువ కావాలని డిమాండ్ చేసినట్లు తెలిపాడు. నెలరోజుల క్రితం రూ.లక్ష లంచంగా ఇవ్వగా.. నాలుగు రోజుల క్రితం మరో రూ. 3 లక్షలు డిమాండ్ చేయడంతో ACB ఆశ్రయించినట్లు వివరించాడు. ఈ వారం ప్రారంభంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట్ మండలానికి చెందిన తహశీల్దార్ రూ.10 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ పట్టుకుంది. రూ.10 లక్షలు లంచం తీసుకుంటూ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట తహశీల్దార్‌తోడేటిసత్యనారాయణఅవినీతి శాఖ అధికారులకు పట్టుబడ్డాడు.

## నేడు జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ ప్రయోగం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి16 : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) షార్ కేంద్రంలోని రెండో ప్రయోగ వేదిక నుంచి శనివారం సాయంత్రం 5.35 గంటలకుజీఎస్ఎల్‌వీఎఫ్-14 రాకెట్‌ను ప్రయోగించనున్నారు. మధ్యాహ్నం ఈ క్రమంలో ఈరోజు మధ్యాహ్నం 2.05 గంటలకు కౌంట్ డౌన్ మొదలైంది. 27 గంటల 30 నిమిషాల కౌంట్ డౌన్ అనంతరం.. రేపు సాయంత్రం 5.35 గంటలకు శ్రీహరికోటలోని రెండో ప్రయోగ వేదిక నుంచి రాకెట్ ను నింగిలోకి పంపనున్నారు శాస్త్రవేత్తలు.ఈ రాకెట్ ద్వారా 2 వేల 275 కిలోల బరువు కలిగిన INSAT-3DS అనే ఉపగ్రహాన్ని ఇస్రో ప్రయోగిస్తుంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఈ సమాచార ఉపగ్రహం ద్వారా భూమి ఉపతరితలం, పర్యావరణాన్ని పర్యవేక్షించడం, వాతావరణ ప్రొఫైల్ డేటాను అందించడం, డేటా సేకరణ, వ్యాప్తిని సులభతరం చేయడం, ఉపగ్రహ సహాయక శోధన, రెస్క్యూ సేవలను అందించడం ఈ మిషన్ ముఖ్యమైన లక్ష్యాలు. దీని అభివృద్ధిలో భారత్‌కు చెందిన పలు కంపెనీలు ముఖ్య పాత్ర పోషించాయి. ఇది షార్ కేంద్రం నుంచి 92వ ప్రయోగం కాగా.. జీఎస్ఎల్‌వీ సిరీస్‌లో 16వ ప్రయోగం పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో క్రయోజనిక్ ఇంజిన్లు తయారు చేసుకుని చేస్తున్న 10వ ప్రయోగం కావడం విశేషం అని ఇస్రో శాస్త్రవేత్తలు వెల్లడించారు.

## బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి

- కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందు దొందే..
- ఈ రెండు అవినీతి, కుటుంబ పార్టీలే
- ఈ రెండు పార్టీలు మజ్లిస్ పంచన చేరుతాయి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్,ఫిబ్రవరి16 : ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం పక్కన పెట్టిన కాంగ్రెస్ పార్టీ ఢిల్లీకి సూట్ కేసులు మోస్తున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో ప్రభుత్వంలో ఉన్న కాంగ్రెస్ రాహుల్ గాంధీ కోసం కాంట్రాక్టర్లను, బిల్డర్లను, కంపెనీలను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తోందని ఆయన ఆరోపణలు చేశారు. అన్నారు. మొన్నటి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు కర్నాటక నుంచి సూట్ కేసులు వస్తే.. ఇప్పుడు తెలంగాణ నుంచి ఢిల్లీకి వెళ్తున్నాయని విమర్శించారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వైసీపీ నాయకులు వెల్లల రామ్మోహన్ తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దొందు దొందే అని కిషన్‌రెడ్డి విమర్శించారు. "ఈ రెండు అవినీతి, కుటుంబ పార్టీలే. మిగతా 3లో..

## తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌గా సిరిసిల్ల రాజయ్య

హైదరాబాద్,ఫిబ్రవరి16 : తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌గా మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యను సర్కారు నియమించింది. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులుగా ఎం.రమేశ్, సంకేపల్లి సుధీర్‌రెడ్డి, నెహ్రూ నాయక్ మాలోత్‌ను నియమిస్తూ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా రెండేళ్లపాటు పదవిలో కొనసాగనున్నారు. సిరిసిల్ల రాజయ్య వరంగల్ (ఎస్సీ) పార్లమెంట్ స్థానం నుంచి 15వ లోక్‌సభకు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి గెలుపొందారు.

## ఏడోరోజు అసెంబ్లీ సమావేశాలు

వాయిదా తీర్మానం తిరస్కరణ

2లో..

## ప్రజానాడి




## నాణేలపై రామ్‌లల్లా, అయోధ్య ఆలయ చిహ్నాలు



### అయోధ్య రాముడి పేరిట నాణేలు విడుదల

### విడుదల చేసిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి16 : ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం మూడు సావనీర్ నాణేలను విడుదల చేశారు. ఇందులో బాల రామయ్య, అయోధ్యలోని రామజన్మభూమి ఆలయం థీమ్ ఆధారంగా ఒకటి. సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు సంబంధించిన 19వ స్థాపన కార్యక్రమంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అయోధ్యలోని రామ్ లల్లా , రామ జన్మభూమి దేవాలయం థీమ్‌తో కూడిన మూడు స్మారక నాణేలను ఆవిష్కరించారు. బుద్ధుని జ్ఞానోదయం అయిన స్థాప జ్ఞాపకార్థం ద్వి-లోహ కవచమైన సావనీర్ నాణేన్ని, భారతదేశంలో అంతరించిపోతున్న జంతువుల్లో భాగంగా ఖడ్గమృగం ఉన్న మరొక నాణెం.. ఇలా మొత్తం మూడు నాణేలను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆర్థిక మంత్రి నిర్మలమ్మ మాట్లాడుతూ..స్మారక స్టాంపులు లేదా నాణేలు తీసుకున్న ఇతివృత్తాలు ఆకట్టుకునే విధంగా ఉంటున్నాయని చెప్పారు. అంతేకాదు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు, పర్యావరణ ఆందోళనలు, దివ్యాంగులకు సంబంధించిన ఆందోళనలను తెలుసుకోవాలని సూచించారు.

## మేడారం జాతరకు భారీ బందోబస్తు

- బందోబస్తులో 14000 మంది పోలీసులు
- 500 సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా!



మేడారం,ఫిబ్రవరి16 : ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన పండుగ అయిన మేడారం జాతర. ఈ జాతరకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. అందుకనుగుణంగానే ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తుంటుంది. ఈ ఏడాది నేర రహితంగా నిర్వహించాలని భావిస్తున్నట్లు ములుగు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ శబరీష్ మీడియాకు తెలిపారు. 20 సెక్టార్లలో నాలుగు కిలోమీటర్ల మేర జాతర నిర్వహించనున్నట్లు, ట్రాఫిక్ సజావుగా ఉండేలా ప్రత్యేక ట్రాఫిక్ వింగ్‌ని నియమించారు. జాతరలో మొదటిసారిగా పోలీసు సిబ్బంది ఎల్ అండ్ టి నుండి కొత్త సాంకేతికతను ఉపయోగించుకుంటారు. ఇది సమస్యల గురించి మేడారంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను హెచ్చరిస్తుంది. అధికారులు స్పందించడానికి, ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు వీలు కల్పిస్తుంది. అంతేకాదు.. 500 సీసీటీవీ కెమెరాలను కూడా ఏర్పాటు చేశారు.జిల్లా ఎస్పీ మీడియాతో విషయాలు వెల్లడిస్తూ క్రైమ్ స్టేషన్ (సిసిఎస్) నుండి 500 మందికి పైగా పోలీసులకు వివిధ విధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ అధికారులు బృందాలుగా ఏర్పడి నేరాల హాట్‌స్పాట్‌లను గుర్తిస్తారు. సురక్షితమైన ఊరేగింపును నిర్ధారించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటారు. రద్దీని కంట్రోల్ చేయడానికి, భక్తుల కదలికలను గమనించడానికి ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. దేవతల రాక సందర్భంగా ఎలాంటి తొక్కిసలాట జరగకుండా క్యూ లైన్‌లను ఏర్పాటు చేశారు. ములుగులోని గట్టమ్మ దేవాలయం-మేడారం మధ్య 12 ట్రాఫిక్ సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 21 నుండి 24 వరకు, విఐపిలు, వివిఐపిలు ప్రార్థనలు చేయడానికి సందర్శిస్తారు. ఇద్దరు డీఐజీలు, 20 మంది ఎస్పీలు, 40 నుంచి 50 మంది ఏఎస్పీలు, 150 మంది డీఎస్పీలు, 400 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు (సీఐలు), 900 మంది స్పెషల్ ఇన్‌స్పెక్టర్లు, 1,000 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు (ఎస్ఐలు) సహా 14,000 మంది పోలీసులు రాత్రింబవళ్లు పని చేస్తున్నారని జిల్లా ఎస్పీ తెలియజేశారు. ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతర నిర్వహణ కోసం నూతనంగా నియామకమైన కమిటీ ఛైర్మన్ తో సహా 14 మంది సభ్యులు సమ్మక్క సారక్క దేవతల సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బాధ్యతలు స్వీకరించారు.. మంత్రి సీతక్క సమక్షంలో వారంతా బాధ్యతలు స్వీకరించి ప్రమాణం చేశారు.. జాతర నిర్వహణలో మా వంతు పాత్ర పోషిస్తామని ప్రమాణం చేశారు. ఉత్సవ కమిటీలో గిరిజన - గిరిజనేతరులకు అవకాశం కల్పించిన మంత్రి సీతక్క. పార్టీలకతీతంగా జాతర సక్సెస్ లో భాగస్వామ్యం కావాలని కోరారు.. ఉత్సవ కమిటీ నియామకాన్ని రాజకీయం చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

# ఏడోరోజు అసెంబ్లీ సమావేశాలు

### వాయిదా తీర్మానం తిరస్కరణ

హైదరాబాద్,ఫిబ్రవరి16: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఏడవ రోజు ప్రారంభమయ్యాయి. సభ మొదలవగానే స్పీకర్ గడ్డం ప్రసాద్ జీరో అవర్‌ను మొదలుపెట్టారు. కాగా.. పదేళ్ల కేసీఆర్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై అసెంబ్లీలో చర్చ జరపాలని, రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణకు కేంద్రానికి లేఖ రాయాలని బీజేపీ వాయిదా తీర్మానం ఇచ్చింది. మరోవైపు ఈరోజు సభలో బీసీ కుల గణనపై ప్రభుత్వం తీర్మానం ప్రవేశ పెట్టింది. అలాగే అసెంబ్లీలో ఇరిగేషన్‌పై సర్కార్ శ్వేత పత్రం విడుదల చేయనుంది. ఈరోజు ఇరిగేషన్‌పై స్వల్ప కాలిక చర్చ జరుగనుంది. ఇరిగేషన్‌పై అధికార ప్రతిపక్షాల మధ్య వాడివేడిగా చర్చ జరిగే అవకాశం ఉంది. నిన్న సభలో కాగ్ రిపోర్టును ప్రభుత్వం ప్రవేశపెట్టగా.. కాగ్ రిపోర్టులో కూడా కాళేశ్వరంపై అనేక ఆరోపణలు గుప్పించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అనేక అవకతవకలు జరిగినట్లు కాగ్ ప్రస్తావించింది. ఈరోజు ఇరిగేషన్ చర్చలో కాగ్ రిపోర్ట్ ప్రధాన అస్త్రంగా మారనుంది. మేడిగడ్డ కుంగిన విధానంపై ప్రభుత్వం సభలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేయనుంది.

# నితీశ్‌కు తలుపులు తెరిచే ఉన్నాయి

### మరోమారు లాలూ ఆహ్వానం



పాట్న,ఫిబ్రవరి16 : బిహార్ రాజకీయాలు రోజురోజుకు రసవత్తరంగా మారుతున్నాయి. ఆర్జేడీ–కాంగ్రెస్ కూటమి నుంచి బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ వైదొలగి, ఎన్డీఏలో చేరడం ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది. ఈ క్రమంలోనే ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ చేసిన కామెంట్స్ ఇంట్రెస్ట్ కలిగిస్తున్నాయి. సొంత గూటికి తిరిగి వెళ్లనని నితీశ్ కుమార్ చెప్పి ఉండవచ్చు. కానీ సొంతింటికి వచ్చేందుకు తలుపులు మూసుకోలేదని, ఆయన ఎప్పుడు కావాలంటే అప్పుడు సొంత గూటికి రావచ్చని చెప్పారు. నితీశ్ కుమార్‌కు పార్టీ మారే అలవాటు ఉందని ఆయన తప్పకుండా మిత్ర కూటమిలో జాయిన్ అయ్యే అవకాశాలు ఉన్నాయని చెప్పడం గమనార్హం. దేశ రాజధాని సరిహద్దులో ఆందోళన చేస్తున్న రైతులకు పూర్తి మద్దతు ఉందని లాలూ ప్రసాద్ అన్నారు. రాహుల్ గాంధీ, తేజస్వీ యాదవ్‌ల ర్యాలీలో భారీగా జనం వస్తున్నారని, రాబోయే లోక్ సభ ఎన్నికల్లో తామే గెలుస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని స్పష్టం చేశారు. కాగా.. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఇటీవల యూటర్న్ తీసుకొని మాజీ మిత్రపక్షమైన ఎన్‌డీఏలో చేరిన విషయం తెలిసిందే. తాను శాశ్వతంగా ఎన్డీఏతోనే ఉంటానని స్పష్టం చేశారు. ఈ క్రమంలో లాలూ చేసిన వ్యాఖ్యలు ఆసక్తి కలిగిస్తున్నాయి.

# కవిత లిక్కర్ స్కామ్ కేసు విచారణ 28కి వాయిదా వేసిన సుప్రీం



న్యూఢిల్లీ,ఫిబ్రవరి16 : ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వేసిన పిటిషన్ పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఫిబ్రవరి 28న విచారణ చేపట్టనున్నట్లు ధర్మాసనం వెల్లడించింది. నళిని చిదంబరం, అభిషేక్ బెనర్జీ దాఖలు చేసిన పిటిషన్లతో కాకుండా కవిత పిటిషన్ ప్రత్యేకంగా విచారిస్తామని తెలిపింది. లిక్కర్ కేసులో ఈడీ ఇచ్చిన నోటీసులను కవిత గతేడాది సుప్రీంకోర్టులో సవాలు చేశారు. తనపై ఈడీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఆదేశించాలని సుప్రీం కోర్టును కోరారు. ఈ పిటిషన్ ను పరిశీలించిన జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిట్టల్ ల బెంచ్ ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. అయితే.. సుప్రీంకోర్టులో మహిళల ఈడీ విచారణ కేసు విచారణ పెండింగ్ లో ఉండటంతో లిక్కర్ కేసులో ఈడీ నోటీసులకు కవిత గైర్హాజరవుతున్నారు. కాగా.. ఢిల్లీ మద్యం కేసులో భాగంగా గతేడాది మార్చిలో కవితను ఈడీ అధికారులు మూడు రోజుల పాటు సుదీర్ఘంగా విచారించారు. ఈ క్రమంలో ఈడీ కార్యాలయం వద్ద కాకుండా మహిళ కాబట్టి తనను ఇంటి వద్దే విచారించాలని కోరుతూ కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విషయం కోర్టు పరిధిలో ఉన్నందున తాను విచారణకు హాజరు కాలేనని కవిత ఈడీ అధికారులకు సమాచారం ఇచ్చారు. విచారణకు హాజరు కాలేనన్న కవిత సమాధానంపై ఈడీ అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

# బిఆర్ఎస్ దెబ్బకు ప్రజాభవన్‌కు సిఎం

### ఎమ్మెల్యే హరీష్ రావు వెల్లడి



హైదరాబాద్,ఫిబ్రవరి16 : బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా ఎప్పుడు ప్రజల పక్షాన్నే పోరాడుతుందని మరోసారి రుజువైందని మంత్రి హరీస్ రావు అన్నారు. అందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఉన్న ఫలంగా ప్రజా భవన్‌కు పరుగులు పెట్టడమే తాజా నిదర్శనం అన్నారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ దెబ్బకు సీఎం రేవంత్‌రెడ్డి నేడు ప్రజాభవన్ కు వెళ్లాల్సి వచ్చిందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శుక్రవారం ఆయన మీడియాతో కొద్దిసేపు చిట్‌చాట్‌చేశారు. ప్రతి రోజు ప్రజాభవన్‌కు వెళ్తానని ప్రగల్భాలు పలికిన సీఎం అధికారంలోకి వచ్చాక తొలిరోజు మాత్రమే వెళ్లారన్నారు. ఇదే విషయంపై బీఆర్ఎస్ ఆధారాలతో నిలదీశామన్నారు.య దీంతో ఈ రోజు హడావుడిగా కేవలం అరగంట ముందు సమాచారం ఇచ్చి వెళ్తున్నారన్నారు. ఇదే విషయం నిన్ననే ప్రజలకు సమాచారమిస్తే చాలా మంది తమ బాధలు చెప్పుకునేందుకు వచ్చేవారని హరీశ్ రావు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ప్రతిపక్ష పార్టీ పాత్రను హుందాగా పోషిస్తుందన్నారు. ప్రజా సమస్యలపై గళమెత్తుతూ పేదల పక్షాన నిలుస్తామన్నారు.

# కారు అద్దాలు పగులకొట్టి 5లక్షలు చోరీ

మెదక్,ఫిబ్రవరి16 : మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలో పట్టపగలు దోపిడీ దొంగలు హల్ చల్ చేశారు. చేగుంట సీతారాం నగర్ కాలనీలోని ఇంటిముందు కారు అద్దాలు ధ్వంసం చేశారు. కారులో ఉన్న రూ.5 లక్షలను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే..మిరుదొడ్డి మండలం పెద్దచెప్యాల గ్రామానికి చెందిన విష్ణువర్ధన్ రెడ్డి యూనియన్ బ్యాంక్‌లో డబ్బులు డ్రా చేశాడు. అనంతరం ఇంటి ముందు కారు ఆపి టీ తాగడానికి ఇంట్లోకి వెళ్లాడు. ఇదే సమయంలో గుర్తు తెలియని నలు గురు దుండగులు వచ్చి అందరు చూస్తుండగానే కారు అద్దాలు ధ్వంసం చేసి అందులో ఉన్న ఐదు లక్ష రూపాయలు దోచుకెళ్లారు. బాధితుడు విష్ణువర్ధన్ రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ పుటేజీల ఆధారంగా త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు.

# కాంగ్రెస్‌లోకి అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్ రెడ్డి

హైదరాబాద్,ఫిబ్రవరి16 : తెలంగాణలో బీఆర్ఎస్ కు షాకుల మీద షాకులు తగులుతున్నాయి. కీలక నేతల ఒక్కొక్కరూ పార్టీని వీడుతున్నారు. కాంగ్రెస్ కండువాలు కప్పుకుంటున్నారు. తాజాగా కీలక నేత గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పేందుకు సిద్ధమయ్యారు. టాలీవుడ్ హీరో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్ రెడ్డి కారు దిగేందుకు సిద్ధమయ్యారు. కాంగ్రెస్ చేరుతున్నానని ఆయన అధికారికంగా ప్రకటించారు.తాను తెలంగాణ వాదినని చంద్రశేఖర్ రెడ్డి చెప్పుకొచ్చారు. తనకు బీఆర్ఎస్ అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తన సొంతగూటికి చేరతానని తెలిపారు. గతంలో యూత్ కాంగ్రెస్ పనిచేసిన విషయాన్ని చంద్రశేఖర్ రెడ్డి ప్రస్తావించారు. కాంగ్రెస్ లో చేరిన తర్వాత పార్టీ ఆదేశాలకు కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.

# కొమురవెల్లి రైల్వే స్టేషన్‌కు కిషన్ రెడ్డి శంకుస్థాపన

- మల్లన్నను దర్శించుకునే భక్తులకు మంచి సౌకర్యం
- వెల్లడించిన కేంద్రమంత్రి



హైదరాబాద్,ఫిబ్రవరి16 : తెలంగాణలో కొత్త రైల్వే స్టేషన్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి భూమి పూజ చేశారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి ఆలయానికి సమీపంలో కొత్తపల్లి–మనోహరాబాద్ కొత్త రైల్వే మార్గంలో నూతన రైల్వే స్టేషన్‌కు భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్, దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు, జనగామ జిల్లా బీజేపీ అధ్యక్షుడు దశమంత్ రెడ్డి పాల్గొన్నారు. కొమురవెల్లి ఆలయానికి లక్షల సంఖ్యలో భక్తులు వస్తూ ఉంటారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. దీంతో ఇక్కడ రైల్వే స్టేషన్ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీలు కిషన్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బండి సంజయ్‌తో పాటు గవర్నర్ తమిళిసైకు భక్తులు వినతిపత్రాలు అందించారు. దీనిని ఎంపీలందరూ రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆలయానికి మూడు కిలోమీటర్ల దూరంలో కొత్త రైల్వే స్టేషన్‌ను రైల్వేశాఖ మంజూరు చేసింది. దీంతో ఇవాళ కొత్త రైల్వే స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ జరిగింది. కొమురవెల్లి స్వామివారి దర్శనానికి ప్రతీ ఏడాది 25 లక్షల మంది భక్తులు వస్తుంటారు. నాలుగు రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. వీరిలో ఎక్కువమంది సామాన్య ప్రజలే ఉంటారు. రైల్వే సదుపాయం అందుబాటులో లేకపోవడంతో ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వెహికల్స్‌లలో ఇక్కడికి చేరుకుంటారు. బస్సు ద్వారా చేరుకోవాలంటే రెండు, మూడు బస్సులు మారాల్సి ఉంటుంది. బస్సుల్లో రావాలన్నా, తిరిగి వెళ్లాలన్నా ఆలయం నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజీవ్ రహదారిపై గంటల కొద్ది వేచి ఉండాల్సి వస్తుంది. ఇక ప్రైవేట్ వెహికల్స్‌లో రావాలంటే ఖర్చు అధికమవుతుంది. రైలు ప్రయాణం అందుబాటులోకి వస్తే ప్రయాణ భారం తగ్గనుంది. కొత్త రైల్వే స్టేషన్ ఏర్పాటుతో లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. కొత్త రైల్వే స్టేషన్ మంజూరు, భూమిపూజతో స్థానికులు, భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. రైల్వే స్టేషన్ త్వరతగతిన అందుబాటులోకి తీసుకొస్తే భక్తులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆలయ నిర్వాహకులు కూడా చెబుతున్నారు. భూమి పూజ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో రైల్వే స్టేషన్లు తక్కువగా ఉన్నాయని, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణలో మెదక్, సిద్దిపేట రైల్వే లైన్ ఇచ్చిందన్నారు. 2014 రైల్వే బ్జడెట్‌లో తెలంగాణకు రూ.250 కోట్లు కేటాయిస్తే.. ఇప్పుడు రూ.6 వేల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. బీజేపీ ప్రభుత్వంలోనే రైల్వే రంగంలో వేగంగా అభివృద్ధి జరుగుతుందని, యూపీఏ ప్రభుత్వంలో రాష్ట్రానికి ఒక్క రైల్వే లైన్ కూడా రాలేదని ఆరోపించారు. యూపీఏ హయాంలో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని ఆరోపించారు. రీజనల్ రింగ్ రోడ్డు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.26 వేల కోట్లు కేటాయించబోతుందని, కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ సర్కార్ భూసేకరణ చేస్తే వెంటనే పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. గత ప్రభుత్వం భూసేకరణ చేపట్టకుండా నిర్లక్ష్యం చేసిందని, కొత్త ప్రభుత్వమైన చర్యలు తీసుకోవాలని కిషన్ రెడ్డి కోరారు.

# తెలంగాణలో బిసి కులగణన

### అసెంబ్లీలో తీర్మానం ప్రవేశ పెట్టిన మంత్రి పొన్నం

### స్వాగతించిన విపక్షసభ్యుడు కడియం శ్రీహరి



హైదరాబాద్,ఫిబ్రవరి16 : తెలంగాణ అసెంబ్లీలో బీసీ కులగణన తీర్మానాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ప్రవేశపెట్టారు. దీనిపై మాట్లాడిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం.. కుల గణన చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఇంటిని, కులాన్ని సర్వే చేసి.. ప్రజల ఆర్థిక స్థితి గతులు తెలుసుకుంటామని అన్నారు. సర్వేలో అన్ని వివరాలు పొందు పరుస్తామని.. సర్వ రోగ నివారిణిలా సర్వే ఉంటుందని పేర్కొన్నారు. కాగా, కులగణనను తాము ఆహ్వాని స్తున్నట్లు బీఆర్ఎస్ నేత కడియం తెలిపారు. 'అసెంబ్లీలో బీసీ కులగణన తీర్మానం ప్రవేశపెట్టడం దేశ చరిత్రలోనే చారిత్రాత్మకం. దేశంలోని సంపద, రాజ్యాధికారం జనాభా దామాషా ప్రకారం దక్కాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. అందు కోసమే ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే కుల గణన చేస్తామని చెప్పాం. రాష్ట్రవ్యాప్తంగా కులగణనతో పాటు సోషల్, ఎకానమిక్, ఎడ్యుకేషన్, పొలిటికల్, ఎంఎలాయిమెంట్ అంశాలపై సర్వే చేస్తాం. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఇంటిని, అన్ని కులాలు, ఆర్థిక స్థితిగతలపై సర్వే నిర్వహిస్తాం. ఈ సర్వే ద్వారా సంపదను అన్ని వర్గాలకు జనాభా దమాషా ప్రకారం ఎలా పంచాలన్న దానిపై ప్రణాళికలు తయారు చేస్తాం. సామాజిక ఆర్థిక రాజకీయ మార్పునకు పునాదిగా తెలంగాణ మారబోతుంది.' అని భట్టి తెలిపారు.అసెంబ్లీలో కులగణన తీర్మానాన్ని తాము స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. కానీ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానంలో స్పష్టత లేదని.. దీనిపై క్లారిటీ ఇవ్వాలని అన్నారు. 'జనం, కులం అంటూ ద్వంద్వ వైఖరి కనిపిస్తోంది. జనగణన చేసే హక్కు రాష్ట్రాలకు లేదు. కులగణన మాత్రమే చేసే హక్కు ఉంటుంది. తీర్మానానికి చట్ట బద్ధత అయినా కల్పించాలి. లేదా న్యాయపరంగా అయినా ముందుకు వెళ్లాలి. ఎలాంటి చట్ట బద్ధత లేకుండా తీర్మానం పెడితే లాభం ఉండదు. కులగణన చేపట్టిన ఆయా రాష్ట్రాలు న్యాయపరంగా ఇబ్బందులు ఎదుర్కొన్నాయి.' అని పేర్కొన్నారు.

# మార్చి 31న జెన్‌కో ఏఈ, కెమిస్ట్ రాత పరీక్ష

హైదరాబాద్,ఫిబ్రవరి16 : తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (జెన్‌కో) లో అసిస్టెంట్ ఇంజినీర్(ఏఈ), కెమిస్ట్ ఉద్యోగాల నియామకాలకు సంబంధించిన రాత పరీక్ష తేదీలు విడుదలయ్యాయి. మార్చి 31వ తేదీన ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్ష జరగనుంది. హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో పరీక్ష నిర్వహించనున్నారు. మూడు షిఫ్టుల్లో పరీక్ష జరుగుతుంది. మొదటి షిఫ్ట్ ఉదయం 9.00 గంటల నుంచి 10.40 (మెకానికల్/ కెమిస్ట్) వరకు, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 1 గంట నుంచి 2.40 గంటల వరకు (ఎలక్ట్రికల్), మూడో షిఫ్ట్ సాయంత్రం5 గంటల నుంచి 6.40 గంటల వరకు (సివిల్/ ఎలక్ట్రానిక్స్) జరుగుతుంది.కాగా ఈ నోటిఫికేషన్ కింద తెలంగాణ రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థలో మొత్తం 339 అసిస్టెంట్ ఇంజినీర్ పోస్టులు, 60 కెమిస్ట్ పోస్టులను ప్రత్యక్ష, రెగ్యులర్ నియామకాల పద్ధతిలో భర్తీకి సంస్థ యాజమాన్యం ప్రకటన జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఉన్న పాత విద్యుత్ కేంద్రాలతోపాటు రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ కేంద్రాల నిర్వహణకు అవసరమైన పోస్టులను భర్తీ చేస్తున్నట్టు సంస్థ తెలిపింది.దేశ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్స్ (సీఆర్‌పీ ఎస్‌పీఎల్–XIII) ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఇటీవల మెయిన్స్ పరీక్షను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్ష ఫలితాలను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్(ఐబీపీఎస్) తాజాగా విడుదల చేసింది. పరీక్ష రాసిన అభ్యర్థులు రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను నమోదు చేసి ర్యాంక్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కాగా జనవరి 28వ తేదీన దేశ వ్యాప్తంగా ఉన్న పలు పరీక్ష కేంద్రాల్లో మెయిన్స్ పరీక్ష జరిగింది. ఈ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 1402 ఐటీ ఆఫీసర్, అగ్రికల్చరల్ ఫీల్డ్ ఆఫీసర్, రాజ్‌భాష అధికారి, లా ఆఫీసర్, హెచ్‌ఆర్/ పర్సనల్ ఆఫీసర్, మార్కెటింగ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ప్రిలిమినరీ, మెయిన్ రాత పరీక్షలు, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా అభ్యర్థుల తుది ఎంపిక ఉంటుంది.

# కులగణనకు బిఆర్ఎస్ మద్దతు

- సమగ్ర చర్చ జరగాలన్న గంగుల
- అసెంబ్లీ చర్చ తీరుపై అక్బరుద్దీన్ అసంతృప్తి



హైదరాబాద్,ఫిబ్రవరి16 : అసెంబ్లీలో కులగణన తీర్మానానికి బీఆర్ఎస్ పార్టీ మద్దతు తెలిపింది. తీర్మానంపై బీఆర్ఎస్ తరఫున మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడారు. కులగణన పకడ్బంధీగా నిర్వహించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి గంగుల సూచించారు. అదేవిధంగా కులగణనపై తీర్మానం మాత్రమే కాదు చట్టం చేస్తే బాగుంటుందని అన్నారు. భవిష్యత్తులో న్యాయపరమైన చిక్కులు రాకుండా కులగణన చట్టం ఉండాలని, ఎలాంటి కోర్టు కేసులకు అవకాశం ఉండకూడదని గంగుల సూచించారు. కులగణన పూర్తికాగానే వెంటనే చట్టం చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. కులగణన తర్వాత చట్టం ఎలాంటి పథకాలు అమలు చేయనుందో ముందే చెప్పాలన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఎంబీసీలను మొదటి గుర్తించినదే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని గంగుల చెప్పారు. ఎంబీసీలకు మంత్రి పదవి ఇవ్వాలని సూచించారు. బీసీ సబ్‌ఎ÷–లాన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీహార్లో ఇప్పటికే కులగణన చేశారని, కానీ న్యాయపరమైన చిక్కులు వచ్చాయని ఆయన గుర్తుచేశారు. అయితే రాష్ట్రంలో అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న తీరుపై ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం అసెంబ్లీలో కులగణన తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా ప్రభుత్వ తీరుపై ఫైర్ అయ్యారు. సభా కార్యకలాపాలను కాంగ్రెస్ పార్టీ ఏకపక్షంగా నిర్ణయిస్తుందని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన సభా సాక్షిగా తన అసంతృప్తిని వెల్లగక్కారు. పార్టీలను విశ్వాసంలోకి తీసుకోనప్పుడు బీఏసీ ఎందుకు అని సూటిగా ప్రశ్నించారు. బీఏసీలో చెప్పని అంశాలపై ఎందుకు చర్చ పెట్టారని నిలదీశారు. సభలో బిజినెస్ ఏముంటుందో ముందుగా తెలియడం లేదన్నారు. 13వ తేదీ వరకు మాత్రమే బీఏసీ సమావేశాల్లో చర్చించారన్నారు. ఆ తర్వాత అసెంబ్లీలో ఏం జరుగుతుందో సమాచారం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కులగణనకు తాము మద్దతు ఇస్తున్నామన్నారు. న్యాయపరమైన సమస్యలు ఎదురుకాకుండా చూడాలన్నారు. అలాగే సమగ్ర సర్వే వివరాలతో ఎవరికి ప్రయోజనం కలిగిందో ప్రభుత్వం వెల్లడించాలన్నారు.

# బిఆర్ఎస్‌లో ఎన్డీఎలో చేరడం అబద్ధం

- రాజకీయం కోసం కెసిఆర్ దుష్ప్రచారం
- బిఆర్ఎస్ 8మంది ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారు
- బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్,ఫిబ్రవరి16 : 8 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, 5మంది బీఆర్ఎస్ ఎంపీలు బీజేపీతో టచ్‌లో ఉన్నారని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. బీఆర్ఎస్ ఎన్డీఏలో చేరుతోందని ఢిల్లీ నుంచి జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. ఎట్టి పరిస్థితుల్లో బీఆర్ఎస్‌తో పొత్తు ఉండదని.. ఇదంతా కేసీఆర్ ఆడుతున్న నాటకమని ఆయన అన్నారు. సాక్షాత్తు ప్రధాని మోడీనే వారి అవినీతిపై మాట్లాడారని బండి సంజయ్ పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడే కేసీఆర్‌ను ఎన్డీఏలో చేరుతామనీ అడిగితేనే చేర్చుకోలేదన్నారు. తెలంగాణలో మేము 17కి 17సీట్లు గెలుస్తామని.. దేశవ్యాప్తంగా 400 సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఒక్కటి కూడా గెలిచే అవకాశం లేదన్నారు. బీఆర్ఎస్‌కు ఎంపీ అభ్యర్థులు లేరని, ఉన్న వాళ్లు పక్క చూపులు చూస్తున్నారన్నారు. ఎంపీకి పోటీ చేయమని అభ్యర్థులను కేసీఆర్ బతిమలాడుతున్నారన్నారు. కేసీఆర్ అవినీతిని వ్యతిరేకించి ఎవరు హరీష్ రావుతో సహా బీజేపీలోకి వస్తామని అంటే ఆహ్వానిస్తామన్నారు. బీఆర్ఎస్ కాంగ్రెస్‌కు అవగాహన ఒప్పందం ఉందన్నారు. అందుకే బీఆర్ఎస్ ఇన్ని స్కాంలు బయటపడుతున్న చర్యలు కాంగ్రెస్ చర్యలు తీసుకోవట్లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి ఉంటే కేటీఆర్, కేసీఆర్ ఇప్పటికే జైలులో ఉండేవాళ్లన్నారు. గ్రౌండ్ లెవెల్‌లో కాంగ్రెస్‌పై వ్యతిరేకత వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసినందుకు ప్రజలు బాధపడుతున్నారన్నారు. కర్ణాటకలోనే కాదు.. తెలంగాణలో సైతం గ్యారంటీల పేరుతో మోసం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్‌కి ఎన్ని సీట్లు వస్తాయనేది ఆ పార్టీ నేతలే చెప్పాలన్నారు. కేఏ పాల్ కూడా 17సీట్లు గెలుస్తాం అనే ధీమాతో ఉన్నారన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాముడు మోడీ ఒక్కవైపు , రజాకార్లు, ఎంఐఎం, బీఆర్ఎస్ ఒక వైపు ఉన్నాయన్నారు. దేవుడిని రాముడిని నమ్మే వాళ్లు బీజేపీకి ఓటేస్తారన్నారు. బీఆర్ఎస్ అవినీతి అంతా కాగ్ రిపోర్ట్ ద్వారా బయట పడిందని బండి సంజయ్ చెప్పారు. కాళేశ్వరంపై సెంట్రల్ కమిటీ చాలా స్పష్టంగా నివేదిక ఇచ్చిందని తెలిపారు. కాళేశ్వరం పనికి రాదని చెప్పిందని అన్నారు. ప్రజా సమస్యలు ఏమీ లేనట్లు ఒక నది జలాల విషయం పట్టుకుని బీఆర్ఎస్, కాంగ్రెస్ విమర్శలు చేసుకుంటున్నాయని చెప్పారు. అయోధ్య రాముని ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని బహిష్కరించిన పార్టీని ప్రజలే బహిష్కరిస్తారన్నారు. ఏ ప్రభుత్వం అయిన ఐదు ఏళ్లు ఉండాలని కోరుకుంటామన్నారు. ఇచ్చిన వాగ్దానాలు పూర్తి చేయకుంటే ప్రజలే కాంగ్రెస్‌కి బుద్ధి చెప్తారని బండి సంజయ్ వెల్లడించారు. రేవంత్ రెడ్డి ఇంతకు ముందు కూడా బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనని ఆరోపించారు? అప్పుడు కూడా కాళేశ్వరంపై సీబీఐ విచారణ డిమాండ్ చేశారు? అప్పుడెందుకు సీబీఐ ఎంక్వైరీ అడిగారు ? ఇప్పుడెందుకు వెనక్కి తగ్గుతున్నారని ప్రశ్నించారు. తాము హైదరాబాద్ పార్లమెంట్ సీటుపై కూడా దృష్టి పెట్టామని తెలిపారు. కేసీఆర్ అవినీతిని వ్యతిరేకించి వస్తే హరీశ్ రావును బీజేపీలోకి తీసుకుంటామని చెప్పారు.

# రాజకీయంగా బలపడుతున్న కాంగ్రెస్

రాజకీయాల్లో బంధాలు శాశ్వతంగా నిలబడడం లేదు.. అటువారు ఇటు ఇటువారు అటు మారుతున్నారు. అధికారం ఉన్న పార్టీల్లోకి వలసలు పెరిగాయి. ఎవరిపై రాజకీయ ప్రేమలు శాశ్వతంగా ఉండవని మాత్రం గుర్తించాలి. కాంగ్రెస్‌కు అధికారం రావడంతో పలువురు అధికార పార్టీలో చేరుతున్నారు. ఇప్పటికే ఎంపి వెంకటేశ్ చేరారు. బాబా ఫిసయుద్దీన్ చేరారు. ప్రజలు,రాజకీయ నాయకుల మధ్యరాజకీయ బంధాలు శాశ్వతంగా ఉండడం లేదు. ప్రజలకు మాత్రం ఫలితాలు కాన రావడం లేదు. తనను కాపాడి.. రాజకీయంగా ఉన్నత స్థానానికి తీసు కుని వచ్చిన వారికి అంతోఇంతో సేవ చేయడం మామూలు అయ్యింది. ఓట్లు కొల్లగొట్టేందుకు ఎలాంటి పార్టీలు మారినా పట్టించుకోవడం లేదు. రానున్న ఎన్నికలను చూస్తుంటే ప్రజలపట్ల అన్ని పార్టీలు ప్రేమలు ఒలకబోస్తున్నాయి. ఎన్నికల ముందున్న ప్రేమలు ఎన్నికలయ్యాక నిలబ డడం లేదు. కులాల వారీగా ప్రేమలను ప్రకటిస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ మెల్లగా పైచేయి సాధిస్తోంది. రాజ్యసభలో మూడో అభ్యర్థిని నిలబెట్టకపోవడం కూడా రాజకీయ కోణంలోనే చూడాలి. అలాగే తెలంగాణ రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీ మెల్లగా సైడ్ ట్రాక్ పడు తున్న సూచనలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య హోరాహోరీ పోరు సాగుతోంది. లోక్ సభ ఎన్నికలు దగ్గర పడటంతో బీఆర్ఎస్ రేసులోకి వచ్చేందుకు అన్ని అస్త్రాలను ప్రయోగిస్తోంది. ఆ పార్టీకి గట్టి కౌంటర్ ఇచ్చేందుకు అధికార పార్టీ అదే దూకుడు ప్రయోగిస్తోంది. ఈ క్రమంలో బీజేపీ వెనుకబడిపోతున్న సూచనలు కనిపిస్తున్నాయి. కృష్ణా ప్రాజెక్టులు, కాళేశ్వరం విషయంలో బీజేపీ తన వాదనను సమర్థంగా వినిపించలేకపోయింది. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే సమరం సాగుతోందన్న అభిప్రాయం వినిపించడం ప్రారంభమయింది. అసెంబ్లీలో కృష్ణా ప్రాజెక్టుల అప్పగింతపై యుద్ధం జరిగింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ హోరాహోరీ తలపడ్డాయి. ఎవరి వాదన వారు వినిపించారు. ఇందులో రాజకీయం ఉందా.. రాష్ట్ర ప్రయోజనాలు ఉన్నాయా అన్న సంగతి తర్వాత కానీ.. అసలు విషయం రెండు పార్టీలు కలిసి బీజేపీ గురించి ప్రజలు ఆలోచించకుండా చేశాయి. కృష్ణా ప్రాజెక్టులు అప్పగించడం లేదా ఉంచుకోవడం రెండింటిలో దేన్నీ తమ విధానంగా చెప్పలేని పరిస్థితిలో బీజేపీ పడిపోయింది. ఈ వ్యవహారంలో బీజేపీ ఆటలో అరటిపండుగా మారింది. ఇది బీజేపీకి పార్లమెంట్ ఎన్నికలకు ముందు తీర్చలేని సమస్యే. ఆ పార్టీ తరపున అసెంబ్లీలో మహేశ్వర్ రెడ్డి మాట్లాడారు. కానీ ఏపీ నీళ్లు తీసుకెళ్తూంటే.. బీఆర్ఎస్ సైలెంట్ గా ఉందన్న పాతన వాదనే వినిపించారు. కొత్త విషయలేం చెప్పలేదు. కృష్ణా ప్రాజెక్టుల అంశాన్ని గట్టిగా తమ పార్టీ తరపున సమర్థించుకోవడమో లేదా రెండు పార్టీలు కలిసి నాటకాలు ఆడుతున్నాయన్న సంగతిని కానీ గట్టిగా చెప్పలేకపోయారు. ప్రాజెక్టులను కేంద్రం తీసుకుంటున్నా బీజేపీ సైలెంట్ గా ఉందన్న సందేశాన్ని ప్రజల్లోకి పంపిన బీఆర్ఎస్, కాంగ్రెస్ కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు కు ప్రాజెక్టులను అప్పగించిన వ్యవహారంపై అసెంబ్లీలో వాడివేడి చర్చ జరిగింది. ఈ చర్చ సారాంశం ఏమిటంటే కేంద్ర ప్రభుత్వమే ప్రాజెక్టులను బలవంతంగా తీసుకుంటూ తెలంగాణకు అన్యాయం చేస్తుందన్న సందేశం ఇవ్వడం. బీఆర్ఎస్ నేతలు అదే తరహా ప్రసంగాలు చేశారు. కాంగ్రెస్ నేతలూ అదే చెప్పారు. అయితే ఇక్కడ రాజకీయం ఏమిటంటే వీరి ప్రసంగాల్లో ఎక్కడా కేంద్రాన్ని తప్పు పట్టలేదు. కానీ.. అసలు విలన్ కేంద్రమేనన్న సంకేతాలను గట్టిగా పంపారు. కృష్ణా ప్రాజెక్టుల్ని కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రానికి అప్పగిస్తోందనేది బీఆర్ఎస్ ప్రధాన ఆరోపణ. తాము అప్పగించే ప్రశ్నే లేదని.. గతంలోనే అప్పగిస్తూ సంతకాలు చేశారని కాంగ్రెస్ వాదిస్తోంది. దీనిపై అసెంబ్లీలో వాడివేడి చర్చ. ఇందులోనే తాము ప్రాజెక్టులు అప్పగించబోమని తీర్మానం చేసింది కాంగ్రెస్.. బీఆర్ఎస్ సమర్థించింది. మరి బీజేపీ ఎక్కడ ?. రెండు విధాలుగా ఇరుక్కుపోయింది బీజేపీ అందుకే సైలెంట్ అయిపోయింది. రెండు పార్టీలు కలిసి పరస్పర యుద్ధం చేసుకుంటున్నట్లుగా షో చేసి.. బీజేపీని విలన్ గా ప్రజల ముందు పెట్టాయన్న అనుమా నాలు బీజేపీ నేతలు పెరుగుతున్నాయి. అసెంబ్లీ యుద్ధం చూస్తే తెలం గాణలో రాజకీయం అంతా బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య జరుగుతోందని అనిపిస్తే అందులో తప్పేమీ లేదు. ఎందుకంటే ఈ విషయంలో బీజేపీ తన వాదన కూడా వినిపించడానికి ఆసక్తి చూపించలేకపోయింది. ఇద్దరూ నాటకాలు ఆడుతున్నారని అంటున్నా.. బీజేపీ గురించి పట్టించు కోకుండా కేసీఆర్ నల్లగొండలో సభ పెడితే.. కాంగ్రెస్ మేడిగడ్డ టూర్ ఏర్పాటు చేసింది. ప్లాన్డ్ గా ఎమ్మెల్యేలందర్నీ తీసుకెళ్తామని చెప్పింది. అసెంబ్లీలో ప్రాతినిధ్యం ఉన్న పార్టీల్లో కాంగ్రెస్, సీపీఐ, మజ్లిస్ పార్టీలు మేడిగడ్డకు వెళ్లాయి. బీఆర్ఎస్, బీజేపీ మాత్రమే వెళ్లలేదు. దీంతో ఆ రెండు పార్టీల మధ్య బంధం ఉందని.. కాంగ్రెస్ ప్రచారం చేస్తోంది. దీన్నిగట్టిగా తిప్పికొట్టలేని పరిస్థితుల్లో బీజేపీ పడిపోయింది. గతంలోనూ ఇలాంటి ప్రచారమే జరిగింది. అది బీజేపీకి నష్టం చేసింది. తెలంగాణలో బీఆర్ఎస్ , కాంగ్రెస్ మధ్యే ఏదో పోరాటం నడుస్తోందని.. రెండు పార్టీల మధ్యే యుద్ధం జరుగుతోందని అనిపించడానికి.. కృష్ణా ప్రాజెక్టులు, మేడి గడ్డతో పాటు ఇతర అంశాలతో రాజకీయం చేస్తున్నారని బీజేపీ అనుమా నిస్తోంది. అసలు లేని వివాదాన్ని తెరపైకి తెచ్చి సభలు.. సమా వేశాలు పెట్టుకుంటున్నారని.. ఇదంతా లోక్ సభ ఎన్నికల రాజకీయం అని గట్టిగా నమ్ముతోంది. కానీ.. కౌంటర్ ఇవ్వడానికి మాత్రం ఆ పార్టీకి సరైన అవకాశం..వాయిస్ దొరకడంలేదు.కృష్ణా ప్రాజెక్టుల్ని తాము కాపాడుతున్నామంటే.. తాము కాపాడుతున్నామని బీఆర్ఎస్, కాంగ్రెస్ అసెంబ్లీ వేదికగా వాదించుకుంటున్నాయి. లోక్ సభ ఎన్నికలపై బీజేపీ చాలా ఆశలు పెట్టుకుంది. మోదీ హవా, రామమందిరం ట్రాన్స్‌తో కనీసం పది సీట్లను గెల్చుకోవాలని టా÷-గ్గ÷ట్ పెట్టుకుంది. కానీ రాజకీయ పరిస్థితులు మాత్రం.. రెండు పార్టీల మధ్య పోరాటంలా మారుతోంది.

# భీష్మాష్టమి



(రామ కిష్టయ్య సంగన భట్ల)
94405 95494

**మాఘ** శుక్ల సప్తమి మొదలు ఏకాదశి వరకు గల ఐదు రోజులను భీష్మ పంచకాలుగా భావిస్తారు. భారత యుద్ధం సమయంలో క్షతగాత్రుడై, దక్షిణాయనంలో ప్రాణం వదలడానికి ఇష్టం లేని భీష్ముడు ఉత్తరాయణం వచ్చే వరకూ, అంపశయ్యపై పరుండి ఉండి, మాఘ శుక్ల సప్తమి నుండి ఐదు రోజులలో రోజుకొక ప్రాణాన్ని విడనాడారని చెపుతారు. కాల నిర్ణయ చంద్రిక, నిర్ణయ సింధు, ధర్మసింధు, కాల మాధవీయం మున్నగు గ్రంథాలు మాఘ శుద్ధాష్ట మిని భీష్మ నిర్యాణ దినంగా చెపుతున్నాయి. కార్తీక బహుళ అమావాస్య నాడు భారత యుద్ధ ప్రారంభ దినంగా భావించ బడుతుంది. కార్తీక మాసంలో రేవతీ నక్షత్రం నాడు శ్రీకృష్ణుడు, కౌరవుల వద్దకు రాయబారానికి పయనమైనట్లు భారతంలో ఉంది. కార్తీక పౌర్ణమినాడు కృత్తికా నక్షత్రం అవుతుంది. కృత్తికా నక్షత్రానికి మూడవ పూర్వపు నక్షత్రం రేవతి. ఆనాటి గణనలో రేవతీ నక్షత్రం శుద్ధ త్రయో దశి అవుతుంది. రాయబారిగా వెళ్ళిన కృష్ణుడు హస్తినాపురంలో కొద్ది రోజులున్నాడు. వస్తూ కర్ణునితో మాట్లాడాడు. సదరు సంభాషణలో శ్రీకృష్ణుడు జ్యేష్టా నక్షత్రంతో కూడిన అమావాస్య నాడు యుద్ధం ప్రారంభం కాగలదని కర్ణునికి చెపుతాడు. భీష్ముడు అంశయ్యపై యాభై ఎనిమిది రోజులు ఉన్నట్లు భారతంలో స్పష్టపరచ బడింది. భీష్మాచార్యులు యుద్ధం చేసింది పది రోజులు. భారత యుద్ధం ప్రారంభమైన కార్తీక బహుళ అమావాస్య నుండి 68 రోజులు లెక్కిస్తే వచ్చేది మాఘ శుద్ధాష్టమి. అదీగాక భారత యుద్ధ ప్రారంభంలో అర్జునుడు బంధు వధకు శంకిస్తాడు. ఆ సందర్భం లోనే శ్రీకృష్ణుడు, విజయునికి తత్త్వోపదేశం చేస్తాడు. ఆ ఉపదేశమే భగవద్గీత. ఈ ఉపదేశం యుద్ధం ప్రారంభ దినాన జరిగింది. ఆ దినాననే గీతా జయంతి (భగ వద్గీత పుట్టినదినం)గా జరపడం కొన్ని చోట్ల ఉంది. కనుక మాఘ శుక్లపక్ష అష్టమియే భీష్మ నిర్యాణ దినంగా భావిస్తారు. మహాతపస్వి అయిన భీష్ముడు పితృభక్తికి, ఇచ్చినమాట నిలబెట్టు కోవడానికి, శౌర్యసంపదకు ఓ గొప్ప ఉదాహరణ. అపారమైన శాస్త్రవిజ్ఞానాన్ని, ధర్మతత్వాన్ని, పరమాత్మతత్వాన్ని కూడా చక్కగా అవగతం చేసుకున్నాడు. అంపశయ్య మీద ఉన్నప్పుడు కృష్ణ భగవానుడి ప్రోత్సాహంతోనే ధర్మరాజుకు గొప్ప జ్ఞానాన్ని ప్రబోధించాడు. వర్ణాశ్రమ ధర్మాలు, రాజ ధర్మాలు, ఆపద్ధర్మాలు, మోక్ష ధర్మాలు, శ్రాద్ధ ధర్మాలు, స్త్రీ ధర్మాలు, దాన ధర్మాలు, ఇలాంటి ఎన్నెన్నో ధర్మాలను గురించి ధర్మరాజుకు ఉన్న ధర్మసందేహా లన్నింటినీ తీర్చి సమాధానాలిచ్చాడు భీష్ముడు. ఆనాడు ధర్మరాజుకు ఉపదే శించిన విష్ణు సహస్రనామాలు ఈనాటికీ ప్రజల నాలుకల మీద నానుతూనే ఉన్నాయి.

పద్మ పురాణంలో, హేమాద్రి వ్రత ఖండంలో భీష్మాష్టమి గురించి చెప్పబడింది. భీష్మాష్టమి రోజున భీష్మునికి తిలాంజలి సమర్పించే వారికి సంతాన ప్రాప్తి కలుగుతుందని విశ్వాసం. ఈనాడు భీష్మునికి తర్పణం విడవాలని స్మృతి కౌస్తుభం తెలుపుతున్నది. కృత్యసార సముచ్చయాధారంగా భీష్మాష్టమి శ్రాద్ధదినం. భీష్మ ద్వాదశి వ్రతం ఈ దినాననే ప్రారంభిస్తారని నిర్ణయ సింధువు స్పష్ట పరుస్తున్నది. భీష్మాష్టమి భారత దేశమంతటా జరుపుకోవాల్సిన పర్వమని వ్రతోత్సవ చంద్రిక సూచిస్తున్నది. కొందరు పంచాంగ కర్తలు ఈనాటి వివరణలో నందినీ పూజ, భీష్మాష్టమిగా పేర్కొంటారు. "వైయాఘ్ర సద్య గోత్రాయ సాంకృత్య ప్రవరాయచ, అపుత్రాయ తదామ్యే తజ్జలం భీష్మాయవర్మణే, వసూ నామావతారాయ శంతనోరాత్మజాయచ, అర్ఘ్యం దదామి భీష్మాయ ఆబాల బ్రాహ్మ చారిణి". అంటూ ఈదినం భీష్ములకు తర్పణం విడవాలని అమాదేర్ జ్యోతిషి పేర్కొంటున్నది. ఈనాడు తర్పణం శ్రాద్ధం చేసిన వారికి సంవత్సర పాపం నశిస్తుందని భావన.






# ఉగ్రదాడుల నుంచి గుణపాఠం నేర్వాలి

- **పాక్ కొత్త ప్రభుత్వం అందుకు కట్టుబడాలి**



న్యూఢిల్లీ,ఫిబ్రవరి16 : పుల్వామా ఉగ్రదాడి జరిగి ఐదేళ్లు కావస్తోంది. అయినా పాకిస్థాన్ ఉగ్రవాదుల కార్ఖానాలను మూసేయడం లేదు. కొత్త ప్రభుత్వం అయినా ఉగ్రమూకకు అండగా నిల్వకుండా చూసుకోవాల్సి ఉంది. అంతర్జాతీయంగా అభాసు పాలవుతున్నా తన కుత్సితాలను పాకిస్తాన్ వదులు కోవడం లేదు. నాలుగేళ్ల క్రితం 2019 ఫిబ్రవరి 14న భారత సైనికులను లక్ష్యంగా చేసుకుని కశ్మీర్‌లోని పుల్వామా వద్ద పాక్‌కు చెందిన జైషే మహమ్మద్ ఉగ్రవాదులు జరిపిన ఆత్మాహుతి దాడిలో 40 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. జమ్మూ నుంచి సైనికులు శ్రీనగర్‌కు వెళ్తుండగా ముష్కరులు మాటువేసి మరి ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. ఈ నెత్తుటి మరకకు నేటితో మూడేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఉగ్రదాడిలో అమరులైన జవాన్లకు దేశమంతా అశ్రునివాళులు అర్పించింది. ఈ ఘాతుకానికి పాల్పడిన పాక్ ఉగ్రమూకలకు భారత సైన్యం సర్జికల్ స్ట్రైక్స్ రూపంలో గుణపాఠం చెప్పింది. అయితే మూడేళ్లు గడిచిన కూడా ఆ భయంకర సంఘటన అందరినీ కదిలించింది వేస్తోంది.'2019లో పుల్వామా దాడిలో అమరులైనవారందరి సేవలు ఎప్పటికీ గుర్తుంచుకుంటాం. జవాన్ల ధైర్య సాహసాలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తిగా నిలుస్తాయి' అంటూ జవాన్లకు ఏటా నివాళి అర్పిస్తున్నాం. పాకిస్తానీ టెర్రరిస్టు గ్రూప్ జైషే మహమూద్ కు చెందిన సూసైడ్ బాంబర్ కారులో ఐఈడీతో దూసుకొచ్చి సీఆర్పీఎఫ్ జవాన్లు వెళ్తున్న బస్సును ఢీకొట్టాడు. అవంతిపుర దగ్గర జమ్మూ శ్రీనగర్ నేషనల్ హైవేపై జరిగిన ఘటనలో 76వ బెటాలియన్ కు చెందిన 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు వెళుతున్న బస్సును.. 300 కేజీల పేలుడు పదార్థాలతో నిండి ఉన్న కారుతో ఓ సూసైడ్ బాంబర్ ఢీకొట్టాడు. దీంతో బస్సులో ఉన్న 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు అమరులయ్యారు. పుల్వామా దాడి జరిగిన కొన్ని రోజుల తర్వాత ఈ దురాగతానికి తామే బాధ్యులమని జైషే మహమూద్ ఉగ్రసంస్థ ప్రకటించుకుంది. సూసైడ్ బాంబర్ కు సంబంధించిన వీడియోను కూడా రిలీజ్ చేసింది. ఈ దాడికి పాల్పడిన వ్యక్తిని అదిల్ అహ్మద్ దార్ గా గుర్తించారు. అదిల్ స్వస్థలం పుల్వామా జిల్లా గుండీబాగ్. ఎటాక్ కు ఏడాది క్రితమే అతను జైషేలో చేరాడు. ఎటాక్ జరిగిన స్థలానికి 10 కిలోమీటర్ల దూరంలో ఇల్లు అ÷-ద్దెకు తీసుకున్నాడు. మారుతీ ఎకో వ్యాన్ ను రెంట్ కు తీసుకుని అదిల్ దాడికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. దాదాపు 15 రోజుల తర్వాత పాకిస్తాన్ లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం సర్జికల్ స్ట్రయిక్స్ చేసింది. 2019 ఫిబ్రవరి 26న ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ÷టైర్ జెట్స్ పాకిస్తాన్ బాలాకోట్ లోని జైషే ట్రైనింగ్ క్యాంప్ పై బాంబుల వర్షం కురిపించాయి. పుల్వామా ఎటాక్ సూత్రధారి, జైషే మహమూద్ కశ్మీ ర్ చీఫ్ మహమూద్ ఖరి యాసిర్ ను అవంతిపురాలోని పరిట్రాల్ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో భద్రతా బలగాలు హతమార్చాయి.

# ప్రత్యేకహోదాపై నోరుమెదపని వైసిపి


- **కేంద్రాన్ని నిలదీయడంలో పూర్తిగా విఫలం**
- **వైసిపి తీరుపై మండిపడ్డ ఎంపి రామ్మోహన్ నాయుడు**



విజయనగరం,ఫిబ్రవరి16 : పార్లమెంట్‌లో వైసీపీ ఎంపీలు ప్రత్యేక హోదాపై నోరు మెదపడం లేదని టిడిపి ఎంపీ రామ్మోహన్ నాయుడు మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ అజెండాలో ప్రత్యేక హోదా అంశం పెడితే వైసీపీ తమ గొప్పతనం అన్నట్టు హంగామా చేశారన్నారు. గంటల వ్యవధిలో కేంద్రం హోదాను అజెండా నుంచి తీసేసిందని తెలిపారు. వైసీపీ ఎంపీలు కేంద్రంపై ఎందుకు పోరాడటం లేదని ప్రశ్నించారు. సమాజమే దేవాలయం... ప్రజలే దేవుళ్ళు అనే సిద్ధాంతంతో టీడీపీ పనిచేస్తుందని టిడిపి ఎంపీ రామ్మోహన్ నాయుడు అన్నారు. టిడిపి వచ్చిన తరవాతనే బడుగు,బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలు దక్కాయన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ జగన్‌పై ప్రజలకు మోజు తగ్గిందని, ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత ప్రారంభమయ్యిందన్నారు. ప్రజలు టీడీపీ వైపు చూస్తున్నారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నవరత్నాలు సైతం సరిగ్గా అమలు చేయడం లేదని విమర్శించారు. పేదవాడు దౌర్భాగ్య పరిస్థితి అనుభవిస్తున్నాడని తెలిపారు. గ్రామ సచివాలయాలు సక్రమంగా పనిచేయటం లేదని, ప్రజలు తమ సమస్యలపై టీడీపీని ఆశ్రయి స్తున్నట్లు చెప్పారు.జగన్ ఎందుకు మాట్లాడలేక పోతున్నారని నిలదీశారు. జగన్ పులకేసి రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ప్రత్యేక హోదాపై వైసీపీ కి చిత్తశుద్ధి ఉంటే ఎంపీ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాజీనామాలకు టీడీపీ సిద్ధంగా ఉందని ఎంపీ రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. జగన్ సర్కార్ అరాచక పాలనతో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు నాశనమయ్యాయని ఎంపి అన్నారు. వైసీపీ ప్రభుత్వ అరా చకాలను ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్లాలని కోరారు. రానున్న సార్వ త్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి సీఎంగా చంద్రబాబును చేసేందుకు కార్యకర్తలు, నేతలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. వైసీపీ ప్రభుత్వానిది నిరంకుశ పాలన అని టీడీపీ నేత విమర్శించారు. ప్రభుత్వ తప్పులను ప్రశ్నించే వారిని బెదిరించడం, కేసులు పెట్టి వేధించడం జగన్ పాలనలో పరిపాటిగా మారిందన్నారు. వైసీపీ పాలనపై అన్నివర్గాల ప్రజలు విసిగి వేసారిపోతున్నారన్నారు. టీడీపీ పథకాలకు పేర్లు మార్చి కొందరికి మాత్రమే ఇస్తున్నారని విమర్శించారు.ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఈ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజల వద్దకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. విద్యుత్ కోతలతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రామ్మోహన్ నాయుడు అన్నారు.

# అప్పడే అడ్మిషన్లు..ఫీజుల గోల

- **ధనార్జనే ధ్యేయంగా కార్పోరేట్ రంగం**
- **ముక్కుపిండి ముందే వసూళ్లకు రంగసిద్ధం**



హైదరాబాద్,ఫిబ్రవరి16 : త్వరలో టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రారంభం కాబోతున్నాయి. పిల్లలు పరీక్షల కోసం కుస్తీ పడుతున్నారు. పరీక్షల కోసం అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. అయితే ఇప్పటికే వచ్చే ఏడాదికి సంబంధించి అడ్మిషన్ల గోల మొదలయ్యింది. ప్రైవేట్ స్కూళ్లు యదావిధిగా వసూళ్లకు తెగబడుతున్నాయి. తల్లిదండ్రులను పీల్చి పిప్పిచేసే పనిలో పడ్డాయి. ఈ క్రమంలో వీరి దృష్టి అంతా వసూళ్లపైనే ఉంది. విద్యార్థులు, టీచర్లపై వారికి దృష్టి ఉండడం లేదు. టీచర్లకు సకాలంలో జీతాలు ఇవ్వాలన్న లక్ష్యం పక్కకు పోయింది. కరోనాతో తామే దివాళా తీసామని ఏడుపు మొఖాలు పెడుతున్నాయి. ఫీజలును పెంచేసి డబ్బులు లాగేయాలన్న లక్ష్యంతో కార్పోరేట్ స్కూళ్లు తల్లిదండ్రుల ను వేధించక తప్పడం లేదు. ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా తమ డబ్బు కోసం విద్యావ్యాపారాన్ని నిర్లజ్జగా కొనసాగిస్తున్నారు. తమ ఫీజులను రాబట్టుకనే క్రమంలో వారు ఎంత కఠినానికైనా దిగజారు తున్నారు. అంతా మీ పిల్లల కోసమే అని చెప్పి పరోక్షంగా ప్రకటిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి భవిష్యత్తులో సామాజిక మార్పునకు దోహద పడుతుందని రుజువు చేయాలి. అలాగే ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు చదువును కొనే దుస్థితి నుంచి బయటపడేలా చేయాలి. సామాన్యులకు చదవును దగ్గర చేసేందుకు ఎంతయినా ఖర్చు చేయాలి. అప్పుడే విద్యారగం పటిష్టం కాగలదు. ప్రజలపై ఆర్థిక భారం తగ్గగలదు. లేకుంటే విద్య కోసం పేదలు సైతం లక్షల్లో ఖర్చు చేసేందుకు అప్పుల బారిన పడుతున్నారు. కార్పోరేట్ స్కూల్ ఫీజు దోపిడీలను అరికట్టాలి. నిర్ణీత ఫీజులు ఉండేలా చూడాలి. అందుకు తెలుగు రాష్ట్రాల్లో సాగుతున్న కృషి మరింత ముందుకు సాగాలి. గతంలో తెలంగాణలో కెజి టూ పిజి విద్యకు ప్రణాళిక ప్రకటించినా ఎందుకనో అది పట్టాలకెక్క లేదు. కులరహిత హాస్టళ్లు ఉండకూడదని కూడా చెప్పారు. ఇంతటి ఉదాత్తమైన పథకం ఎందుకనో ముందుకు సాగడం లేదు. నిజానికి ఇప్పటి వరకు సిఎం కెసిఆర్ చేస్తున్న పథకాలు ఒక ఎత్తయితే ఈ పథకం ఒక ఎత్తయ్యేది. తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేది. కామన్ ఎడ్యుకేషన్ అన్నది సమాజాంలో అంతరాలను తొలగిస్తుంది. అది ఎల్‌కెజి నుంచే పిల్లల్లో భేదభావాలు లేకుండా చేస్తుంది. ఇప్పుడున్న స్కూళ్లను చూస్తుంటే ఆర్థికస్థాయిని బట్టి నడుపుతున్నారు. పేదపిల్లలకు కార్పోరేట్ విద్యాసంస్థలను తలదన్నే విధంగా చదువు, సౌలభ్యాలు, మౌలిక వసతులు లభించాలి.

# రథ సప్తమికి పోటెత్తిన భక్తులు



గోదావరీ తీరస్థ ప్రాచీన పుణ్య తీర్థమైన ధర్మపురి క్షేత్రంలో మాఘ శుద్ధ సప్తమి సకల చరాచర జీవరాసుల ప్రాణ ప్రదాతయైన సూర్య భగవా నుని జన్మదిన వేడుకల సందర్భంగా శుక్రవారం సుదూర ప్రాంతాలనుండి ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలలో భక్తులు తరలి వచ్చారు. "సూర్య జయంతిగా, రథ సప్తమి"గా పేరెన్నిక గన్న ఈరోజు సూర్య రథాలు మళ్ళుతాయని, అవి ఉత్తర గతిని సూచిస్తాయని, ఈదినం సూర్య గ్రహణ తుల్యమైన పుణ్యకాలమని భావిస్తారు. పవిత్ర దినాన భక్తులు సూర్యోదయానికి పూర్వమే స్నానాదులు ఆచరించి, దానధర్మాదులు సూర్యోదయా నంతరం చేయాలనే సంకల్పంతో సుదూర ప్రాంతాల నుండి ఉద యాత్పూర్వమే క్షేత్రానికి చేరుకున్నారు. నవ గ్రహాలలో సూర్యపూజ ప్రధానమైనందున, అట్టి సూర్యుని కొలుచుట ఏడాదికోసారి మాత్రమే, రథ సప్తమినాడే కావడంతో, దక్షిణాభిముఖంగా ప్రవహిస్తూ విశేష మహిమాన్వితమైన గోదావరిలో శనివారం భక్తులు, యాత్రికులు, స్థానికులుఉష:కాల సమయంలో పవిత్ర గోదావరి నదిలో మంగళ స్నానాలు ఆచరించారు. ధ్యాన, జప, సంకల్ప, పితృదేవత లకు పిండప్రదానాది క్రతువులను నిర్వహించుకున్నారు. భక్తులు దాన ధర్మాలను ఆచరించారు. గోదావరి పురోహితులచే అర్ఘ్య ప్రదాన, సంకల్పాదుల ను చెప్పించుకుని, గోదావరి మాతను అర్చించారు. సువాసినులు వాయినాలను ముత్తయిదువలకు సమర్పించు కున్నారు. వేకువ జామునే ఆలయాల అర్చకులు వేద మంత్రాలతో, మంగళ వాద్యాలతో పవిత్ర జలాలను తెచ్చి, స్థానిక దేవాలయాల మూల విరాట్టులను అభిషేకించారు. ప్రధానాలయాలైన శ్రీయోగానంద, ఉగ్ర లక్ష్మీ సమేత నారసింహా, శ్రీవేంకటేశ్వర, వేణుగోపాల, యమ ధర్మరాజ, ప్రసన్నాంజనేయ, శ్రీరామలింగేశ్వరాది ఆలయాలలో ప్రత్యేక ప్రాత:కాల అర్చనలు, పూజలు, అభిషేకాలు, నిత్య కళ్యాణాది కార్యక్రమాలను నిర్వహించగా, భక్తులు దైవ దర్శనాలు చేసుకున్నారు. దేవస్థానం ఎసి, ఈఓ శ్రీనివాస్ మార్గదర్శకత్వంలో, ఆస్థాన వేద పండితులు బొజ్జా రమేశ శర్మ, ముత్యాల శర్మ, పౌరో హితులు, ఆలయాల అర్చకులు పంచోపనిషత్ యుక్త వేదోక్త సాంప్రదాయసిద్ధ పూజలను నిర్వహించారు.

prajamantalau daily pages (17-02-24)f_times of varha main (13-2).qxd 2/17/2024 12:37 AM Page 4



## మల్లాపూర్ నూతన ఎస్సై కిరణ్ కుమార్‌ను కలిసి, సన్మానం చేసిన అంబేద్కర్ సంఘం నాయకులు

మల్లాపూర్ ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):



మల్లాపూర్ మండలానికి కథలాపూర్ నుండి బదిలీ పై నూతనంగా వచ్చిన ఎస్సై కిరణ్ కుమార్‌ను అంబేద్కర్ సంఘం నాయకులు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. తర్వాత శాలువాతో చిరు సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘాల జిల్లా నాయకులు, అడ్వకేట్ ఎర్ర రమేష్, మండల అధ్యక్షుడు పెద్దిరెడ్డి లక్ష్మణ్, మండల అధికార ప్రతినిధి సిద్ధ బాలరాజు, ప్రధాన కార్యదర్శి రవి, మండల ఉపాధ్యక్షులు మోతే రమేష్, ఉపాధ్యక్షుడు దళిత రాజు , మండల నాయకులు ఉయ్యాల లక్ష్మణ్, పెద్దిరెడ్డి అశోక్, మానవ హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యం రఘు, దామెర ప్రశాంత్, అభి, శేఖర్, రంజిత్ పాల్గొన్నారు.

## నూతన ఎస్సై, ఎంపీడీఓలను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

మల్లాపూర్ ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):



మల్లాపూర్ నూతన ఎస్సై ని మరియు ఎంపీడీఓ ను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు మల్లాపూర్ మండల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన కిరణ్ కుమార్ గౌడ్‌ని, నూతనంగా ఎంపీడీఓ గా నియమితులైన రాజేందర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి హార్దిక శుభాకాంక్షలు తెలిపిన మల్లాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ మండల అధ్యక్షులు కొమ్ముల చిన్నారెడ్డి,టీపీసీసీ ఫిషర్మెన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రూత్త నారాయణ,మల్లాపూర్ మండల ఫిషేర్మన్ అధ్యక్షులు రొడ్డ రాజు, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు దామెర రాజశేఖర్ రెడ్డి, మామిడి రాజశేఖర్ రెడ్డి, నేరెళ్ల రాజారెడ్డిరెడ్డి, పొన్నం భూమనందం, ఇప్పపెల్లి గణేష్, మొగిలి రాజేందర్ తదితరులు ఉన్నారు.

## రాయికల్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పై వీగిన అవిశ్వాసం

రాయికల్ ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):



రాయికల్ మున్సిపల్ రాజకీయం రంజుగా తయారైంది మున్సిపల్ చైర్ పర్సన్ మోర హనుమాన్లు వైస్ చైర్పర్సన్ రమాదేవి పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందా.. వీగుతుందా... అనే ఉత్కంఠం ఉండేది. ఎట్టకేలకు అవిశ్వాసం వీగిపోయింది సమావేశమునకు 12 మంది సభ్యులకు ఇద్దరు ప్రతిపక్ష కౌన్సిలర్లు మాత్రమే హాజరవ్వడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు ఆర్డిఓ నరసింహమూర్తి తెలిపారు.

## ఏటీఎం ఆసుపత్రిలో యూరినరీ బ్లాడర్ నుండి రాయిని తొలగింపు

బీర్పూర్ ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):



మంగేల గ్రామము బీర్పూర్ మండల్ జగిత్యాల జిల్లాకు సంబంధించి సాగర్ అనే యువకుడికి శుక్రవారం ఏటీఎం ఆస్పత్రిలో యూరినరీ బ్లాడర్ (మూత్రం సంచి) లో 65 ఎమ్ ఎమ్ ఎక్స్ 45 ఎంఎం స్టోన్ ఆపరేషన్ చేసి తీసివేయడం జరిగింది. ఇందులో డాక్టర్ సురేష్ డాక్టర్ కళ్యాణ్ బృందం కలిసి ఈ మూత్రం సంచిలో (యూరినరీ బ్లాడర్ ) లోని రాయిని సక్సెస్ ఫుల్ గా ఆపరేషన్ నిర్వహించారు.

## జగిత్యాలలో అరుదైన శస్త్ర చికిత్స

### 7 కిలోల కణితి తొలగింపు

గొల్లపెల్లి ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):





జగిత్యాల పట్టణంలోని జంబిగద్దే వద్ద గల శ్రీకర ఆసుపత్రిలో శుక్రవారం అరుదైన శస్త్ర చికిత్స చేసి ఏడు కిలోల కణితిని తొలగించారు. ఆదిలాబాద్ జిల్లా జన్నారం కు చెందిన 50 సంవత్సరాల ఓ మహిళ కడుపునొప్పితో ఆస్పత్రిలో చేరగా అన్ని పరీక్ష నిర్వహించి కడుపులో కణితి ఉందని నిర్ధారించి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ చౌటపల్లి శ్రీకాంత్, డాక్టర్ నాగరాణిలు కడుపులో ఉన్న ఏడు కిలోల కణితిని శస్త్ర చికిత్స చేసి తొలగించారు. హాస్పిటల్ యజమాన్యానికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్సారెస్పీ నీటిని వరద కాలువల ద్వారా మిడ్ మానేరుతో దిగువ ప్రాంతాలకు తరలించడం ఖండిస్తున్నా

### ఎమ్మెల్యే సంజయ్ కుమార్

రాయికల్ ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):



ఎస్సారెస్పీ నీరు వరద కాలువల ద్వారా కిందికి తరలించవద్దు అని ఎస్సారెస్పీ స్టేజ్ 1 ఆయకట్టుకు సాగునీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. మేడిపల్లి మండలం తొంబా రావుపేట గ్రామంలో డి 52 కెనాల్ తూము ద్వారా రాయికల్ మండల గ్రామాలకు ఎస్సారెస్పీ నీటిని వదలగా గ్రామ రైతు నాయకులతో కలిసి డీ–52 తూమును పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసిఆర్ గారి సహకారం తో డీ–52 కెనాల్ కు తుం ను 4 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేయటం జరిగిందని తుం ఏర్పాటు తో చెరువులు జలజల సంతరించుకున్నయని 15 గ్రామాలకు నీటి సదుపాయం, భూగర్భ జలాలు పెరిగాయి రాయికల్ మండలం లో 1 కోటి 34 లక్షలతో 6 చెక్ డ్యాంల నిర్మాణం,భూగర్భ జలాలు పెరిగాయి. రాష్ట్ర ఏర్పాటుకు ముందు వేసవిలో చెరువుల్లో చుక్క నీరు లేని పరిస్థితి...నేడు రాయికల్ లో 300 ఎకరాల ఆయకట్టు ఎండ "పోయే పరిస్థితి..నేడు లో 38 టీఎంసీ ల నీరు ఉంది.ఎస్సారెస్పీ స్టేజ్ 1 ఆయకట్టు కు నీటి కొరత లేకుండా చూడాలి.ఎస్సారెస్పీ నీరు వరద కాలువ ద్వారా కిందికి తరలించవద్దు అని,ఎస్సారెస్పీ స్టేజ్ 1 ఆయకట్టు కు సాగు నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. మేడి గడ్డ పిల్లర్ ను బాగు చేసి, ప్రాణహిత ద్వారా దిగువ ప్రాంతాలకు నీరు తరలించాలి. జగిత్యాల రాయికల్, బీర్ పూర్, సారంగా పూర్, ధర్మపురి మండలాలకు నీటి కొరత రాకుండా చూడాలి అని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో రాయికల్ మున్సిపల్ చైర్మెన్ మోర హనుమండ్లు, రాయికల్ పాక్స్ చైర్మెన్ ఏనుగు మల్లారెడ్డి, మాజీ ఏ.ఎం.సి. చైర్మెన్ గన్నే రాజీరెడ్డి, కౌన్సిలర్ తురగ శ్రీదర్ రెడ్డి, ఎంపీపీ రాజ రత్నాకర్ రావు, నాయకులు భీమయ్య, సంగ రమేష్, ధర్మారెడ్డి, సంతోష్ రెడ్డి, ఘంరెడ్డి, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ చట్టాలు, సైబర్ నేరాలు, సామాజిక అంశాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలి

### జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

జగిత్యాల ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):



పోలీస్ చట్టాలు, సైబర్ నేరాలు సామాజిక అంశాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించే విధంగా పోలీస్ కళాబృందం మరింత చురుకుగా పనిచేయాలని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ కళాబృందం సభ్యులకు నూతనంగా రూపొందించిన డ్రెస్ లను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... ప్రస్తుత కాలంలో టెక్నాలజీ పెరుగుదలతో పాటు సైబర్ నేరాల సంఖ్య కూడా పెరుగుతుందని ఈ యొక్క సైబర్ నేరాలు నివారణ గురించి ప్రజలకు అవగాహన పరచాలని అదేవిధంగా పోలీస్ చట్టాలు, సిసి కెమెరాలు యొక్క ప్రాముఖ్యత, మూఢనమ్మకాలు నివారణ, డయల్ 100 యొక్క ఆవశ్యకత గురించి ప్రజలకు వివరించే విధంగా చూడాలని కళ బృంద సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ భీమ్ రావు, ఆర్.ఐ. లు జానీ మియా, రామకృష్ణ , పోలీస్ కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

## అగ్రిటెక్ సౌత్-2024లో ప్యానల్ స్పీకర్‌గా పాల్గొన్న అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి

### పాల్గొన్న 60 మంది సొసైటీ రైతులు

భీమదేవరపల్లి ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):



హైదరాబాద్ ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రిటెక్ సౌత్ నిర్వహించిన "వ్యవసాయంలో మార్పులు- రైతు పాత్ర" అనే అంశంపై ప్యానల్ స్పీకర్ గా ములకనూర్ సహకార గ్రామీణ బ్యాంక్ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు. ఆయనతోపాటు సివిఎస్ రెడ్డి, తపన్ సాహు (నాబార్డ్ ప్రతినిధి), నరసింహారెడ్డి, రాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ, ఫార్మర్ ప్రొడ్యూస్డ్ ఆర్గనైజేషన్ (ఎఫ్ పిఓ) బలోపేతం చేస్తే, రైతుకు మేలు జరుగుతుందని, సిబిఐ సేవలను జిల్లా, మండల స్థాయిలలో తీసుకెళ్లాలని, వ్యవసాయాన్ని వ్యాపారంలాగా బేరీజు వేసుకొని రైతులు ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. వ్యవసాయంలో ఏ మార్పులు తీసుకువచ్చిన రైతును సెంట్రిక్ పాయింట్ గా తీసుకొని ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు కడారి ఆదాం, ఆర్. వెంకట్ రెడ్డి, జిమ్మల భీమ్ రెడ్డి, గుడికందుల శంకరయ్య, చంద్రమౌళి, జాన రమేష్, బి. వీరారెడ్డి, మండ శ్రీనివాస్, గద్ద ఐలయ్య, లింగమూర్తి, చందర్ రావు, మ్యాక స్వామి, ఆలయ మట్టెడ లింగయ్య, భాస్కర్ రెడ్డి, విష్ణు, వ్యవసాయ అధికారులు సంగ శ్రీనివాస్, స్వామిరావు, సాయి కృష్ణలతో పాటు, డైరెక్టర్లు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## చిలకలగూడ సీఐగా అనుదీప్ నియామకం

సికింద్రాబాద్ ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):



ఈస్ట్ జోన్ పరిధిలోని చిలకలగూడ సర్కిల్ ఇన్స్పెక్టర్ (ఎస్.హెచ్.వో ) గా బి.అనుదీప్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. మల్టీ జోన్–2 ఐజీపీ ఆఫీస్ నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇంతకు ముందు చిలకలగూడ స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా పనిచేసిన మట్టం రాజు ఇటీవల సిటీలోని సైబర్ క్రైమ్ విభాగానికి బదిలీ అయి వెళ్ళారు.

## ఉపాధ్యాయుల సర్వీస్ రెగ్యులరైజేషన్ కొరకు సర్వీస్ పుస్తకం సంబంధిత సర్టిఫికెట్ల కొరకై ఆదేశాలు

జగిత్యాల ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):

ఉపాధ్యాయుల సర్వీస్ రెగ్యులరైజేషన్ కొరకు ఇంటెలిజెన్స్ విభాగము నుండి అందిన ఆంటిసిడెంట్స్ నివేదికల ఆధారంగా ఉపాధ్యాయుల జాబితా ప్రొఫార్మాలు జిల్లాలోని ప్రధానోపాధ్యాయులకు, మండల విద్యాధికారులకు పంపబడినది. క్రమ సంఖ్య (1) నుండి (30) వరకు గల ఉపాధ్యాయులు 19/02/2024 రోజున, (31) నుండి (52) వరకు గల ఉపాధ్యాయులు 20/02/2024 రోజున మరియు ప్రమోషన్ క్యాడర్ లో రెగ్యులరైజేషన్ మరియు ప్రొబేషన్ డిక్లరేషన్ కావల్సియున్న ఉపాధ్యాయులు 21/02/2024 తేదీలలో ప్రభుత్వ పాఠశాల, జగిత్యాలనకు తమ నిజ సర్వీస్ పుస్తకం, సర్టిఫికెట్లు, ప్రొఫార్మాలతో సర్వీసు వివరముల పరిశీలన కొరకు హాజరు కావలసినదిగా జిల్లా విద్యాశాఖాధికారి జగిత్యాల ఈ ప్రకటన ద్వారా కోరినారు. ఇతర జిల్లాలకు బదిలీ కాబడిన ఉపాధ్యాయులు సమాచారం తెలియపరిచిన యెడల వారు పని చేయుచున్న జిల్లా విద్యాధికారులకు ఇంటిలిజెంట్స్ నివేదికలు పంపబడును.

## ముల్కనూర్ సమ్మక్క- సారక్క జాతర పోస్టర్ ఆవిష్కరణ

భీమదేవరపల్లి ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):




మండలంలోని ముల్కనూర్‌లో మినీ మేడారంగా భావించే సమ్మక్క సారలమ్మ జాతర వాల్ పోస్టర్ ను శుక్రవారం జాతర చైర్మన్ మాడుగుల వీరస్వామి అమ్మవార్లకు కొబ్బరికాయ కొట్టి ఆవిష్కరించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 21 నుండి 24 వరకు నాలుగు రోజులపాటు జాతర ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ముల్కనూరులో కన్నుల పండుగగా, వైభవంగా నిర్వహించే సమ్మక్క–సారలమ్మ జాతరకి తరలి రావాలని తెలిపారు. పోలీస్ శాఖ బందోబస్తుతో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాతర నిర్వహించబడుతుందని తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు మొబైల్ బాత్రూం, చలువ పందిల్లు, లైటింగ్స్, త్రాగునీటి వసతి, అన్ని ఏర్పాట్లను సమకూర్చామన్నారు. ఈ కార్యక్రమంలో భీమదేవరపల్లి మండల తహసిల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో వీరేశం, సబ్ ఇన్స్పెక్టర్ సాయిబాబు, ఎంపీఓ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి జంగం పూర్ణచందర్, ఉత్సవ కమిటీ మెంబర్లు, కోడూరి సరోజన, ఆదరి రవి, కొలుగూరి రాజు, శ్రీరామోజు సమ్మయ్య, జక్కుల ప్రకాశం, మాడుగుల గోపి తదితరులు పాల్గొన్నారు.

## అగ్రిటెక్ ఎగ్జిబిషన్ సౌత్-2024 సదస్సు

### ప్రదర్శనలో ములుకనూరు రైస్ స్టాల్

### పాల్గొన్న ములుకనూర్ సొసైటీ రైతులు

భీమదేవరపల్లి ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):




ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్, హైదరాబాద్ లో అగ్రిటెక్ ఎగ్జిబిషన్ సౌత్ – 2024 పేరిట నిర్వహించిన రైతు సదస్సులో ములకలు సహకార సంఘం నుండి 60 మందికి పైగా రైతులు పాల్గొన్నారు. అంతకు ముందు ఆడిటోరియంలో జరిగిన సమావేశానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ ఎగ్జిబిషన్లో రైతులకు సంబంధించిన ఉపకరణాలు సుమారు 85 రైతు స్టాల్స్ ని ఏర్పరిచారు. అందులో ముల్కనూర్ గ్రామీణ సహకార సంఘం రైస్ స్టాల్ ఏర్పాటు చేసి రైతులకు సొసైటీ అందిస్తున్న సేవలను సిబ్బంది వివరించారు. జైశ్రీరామ్, ఆర్ ఎన్ ఆర్, బిపిటి బియ్యాన్ని స్టాల్స్ లో ప్రదర్శించారు. చాలామంది రైతులు ముల్కనూర్ రైస్ ను ఇష్టపడుతున్నట్లు తెలిపారు. ఎందుకంటే నాణ్యత తో కూడిన బియ్యమని తెలిపారు. ఈ సదస్సులో సంఘ వ్యవసాయ అధికారులతో పాటు, డైరెక్టర్లు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# అవిశ్వాస తీర్మాణ నాటకం

# బిఆర్ఎస్ కౌన్సిలర్ల స్వలాభం కోసమే!?



**రాయికల్ ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):**
స్వలాభం కోసమే అవిశ్వాస తీర్మాణ నాటకం బిఆర్ఎస్ కౌన్సిలర్లు తెరమీదకి తెచ్చారని భారతీయ జనతా పార్టీ పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ సునీత అన్నారు. శుక్రవారం రోజునరాయికల్ పట్టణంలోని స్థానిక ప్రెస్ క్లబ్ లో భారతీయ జనతా పార్టీ పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ కల్లెడ సునీత ఆధ్వర్యంలో పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఇట్టి సంద ర్భంగా వారు మాట్లాడుతూ రాయికల్ పట్టణ అభివృద్ధికి ఆటం కంగా మారిందని ప్రజలపై పట్టింపు లేదన్నారు. బిజెపి పట్టణ అధ్యక్షులు కల్లేడ ధర్మపురి మాట్లాడుతూ.... అవిశ్వాస తీర్మానం పెట్టిన టిఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రస్తుతం కనిపించడం లేదని, మీడియాలో గోవా వార్త కథనాలు రాజకీయాలను మరింత దిగ జార్చి అభివృద్ధి చేయడం చేతకాక ఇలాంటి నాటకాలకు పురిగొల్పుతున్నారని కమిషన్ల కుక్కకుర్తి పడి వారి పార్టీ నాయకులను వారే చేసే ప్రయత్నం చేశారని దిగజారుడు రాజకీయాలకు పట్టణం కేంద్ర బిందువుగా తయారు చేస్తున్నా రని పట్టణ ప్రజలు భవిష్యత్తు ఎన్నికలలో అభివృద్ధికి ఆటంకం గా మారి లాభల కోసం స్వార్థంగా వ్యవహరించే ఈ నాయ కులను ఆదరించవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కుర్మా మల్లారెడ్డి, రవి, సుమన్, బాన్న సంజీవ్ పాల్గొన్నారు.

## కౌన్సిలర్లు ఏం ఆశించి అవిశ్వాస తీర్మానం పెట్టారో ప్రజలకు బహిర్గతం చేయాలి



**రాయికల్ ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):**
పట్టణానికి చెందిన బి ఆర్ ఎస్ కౌన్సిలర్లు ఏం ఆశించి అవిశ్వాసం తీర్మానం పెట్టారో ప్రజలకు బహిర్గతం చేయాల్సిన అవసరం ఉందని కౌన్సిలర్. మ్యాకల అనురాధ రమేష్ అన్నారు. పట్టణంలో అవిశ్వాస తీర్మాన ప్రక్రియ ప్రజల్లో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠత రేగిందని అవిశ్వాస తీర్మానం పెట్టిన పదిమంది కౌన్సిలర్ లు ఒకే పార్టీకి చెందిన ఒకే కుటుంబంలో ఉండేవారని వాళ్ళు ఎం ఆశించి అవిశ్వాసం పెట్టారో ప్రజలకు బహిర్గతం చేయాల్సిన అవసరం ఉందని వైస్ చైర్మన్ గల రమాదేవి గత మూడు సంవత్సరాలుగా వారికి నచ్చడం లేదని , వైస్ చైర్మన్ మహిళా కాబట్టే మీకు నచ్చడం లేదా అని ప్రశ్నించారు. వారికి వ్యతిరేకంగా తీర్మానం పెట్టిమరల వారం రోజులకే వెనక్కి తగ్గడం వెనుక చైర్మన్ వైస్ చైర్మన్ వారికి నచ్చడం వెనుక ఏం జరిగిందో ఎం లావాదేవీలు, రాజకీయ లబ్ధి, స్వ ప్రయోజనాలు ఏం నెర వేరాయో ప్రజలకు టిఆర్ఎస్ కౌన్సిలర్ లు చెప్పాలని డిమాండ్ చేశారు. గత మూడు నెలలుగా పురపాలక సంఘంలో పారిశు ద్య లేమి ఏర్పడిందని చెత్త ఆటోలు నడవడం లేదని సిబ్బంది లేరని ఫాగింగ్ చేయకపోవడంతో ప్రజలు అనారోగ్యాల పాలయితున్నారని , ప్రజా సంక్షేమం గాలికి వదిలేసి స్వలాభపేక్షతో జల్సాలు, స్వార్థ ప్రయోజనాలకు చేకూర్చుకోవడం కోసం ఇలా వ్యవహరించడం ఎంతవరకు సమంజసం అని ప్రజలు స్వార్థపరులైన వారి కాకుండా నిత్యం ప్రజల్లో ఉండే మా నాయకులను భవిష్యత్తు ఎన్నికల్లో ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు.

## ప్రమాదకరంగా ట్రాన్స్ ఫార్మర్లు

**ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయం**



**రాయికల్ ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):**
రాయికల్ పట్టణ పరిధిలోని మరియు పలు గ్రామపంచాయతీలో ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లకు రక్షణ కంచల నిర్మించకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. ఆయా గ్రామాలకు వ్యవసాయ బోరుబావులకు విద్యుత్ సరఫరా అందించే ట్రాన్స్ఫార్మర్లను రహదారుల వెంట ఏర్పాటు చేశారు. కానీ వాటి చుట్టూ విద్యుత్ శాఖ అధికారులు ఎలాంటి రక్షణ కంచెలు ఏర్పాటు చేయలేదు. దీంతో వర్షాలు కురిసినప్పుడు ట్రాన్స్ఫార్మర్ల వద్ద ఎర్తింగ్ వస్తుండడంతో వాటి సమీపంలోకి వెళ్లిన పశువులు విద్యుత్ ఆగాతానికి గురై మృత్యువాత పడుతున్నాయి. ఇంత జరుగుతున్న విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చిన్నపిల్లలు ఆడుకుంటూ ట్రాన్సర్ వల్ల వద్దకు వెళ్లి విద్యుత్ షాక్కు గురై మృతి చెందుతున్నారని అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్ఫార్మర్ల వద్ద రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసిన జగిత్యాల అర్బన్ మండలం ఎంపీడీవోగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన విజయలక్ష్మి

## సార్వత్రిక సమ్మెకు మద్దతుగా టీఎన్జీవోల నిరసన కార్యక్రమం

**జగిత్యాల ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):**




అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య పిలుపుమేరకు అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షులు మరియు టీఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా ఉద్యోగ జేఏసీ చైర్మన్ మరియు టిఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు బోగ శశిధర్, టిఎన్జీవో జిల్లా కార్యదర్శి మిర్యాల నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో టిఎన్జీవో ఉద్యోగులు, నాలుగవ తరగతి ఉద్యోగులు, పెన్షనర్లు, అనుబంధ సంఘాల ఉద్యోగులు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టినారు. ఈ సందర్భంగా ఉద్యోగ జేఏసీ చైర్మన్ భోగ శశిధర్ మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఆదాయ పన్ను పరిమితిని 10 లక్షల రూపాయలకు పెంచాలని, కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని మరియు అంగన్వాడి వర్కర్ల డిమాండ్లను నెరవేర్చాలని తెలిపారు. జిల్లా కార్యదర్శి మిర్యాల నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల, పెన్షనర్ల మరియు అంగన్వాడి ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ పెన్షనర్లను ఆదాయ పన్ను నుండి మినహాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో నాయకులు అమరేందర్ రెడ్డి, రాజేందర్, రవికుమార్, రాజేశం, మధుకర్, ప్రమోద్, శరత్ సంతోష్, రాజయ్య, శ్రీనివాస్, తిరుపతి, మమత, కే.శైలజ, శ్రావణి, ఎం.శైలజ, శివాని, విజయలక్ష్మి, లలిత, రమ్య, సుధారాణి, జనిత, రేఖారాణి, ఉద్యోగులు, పెన్షనర్లు, అంగన్వాడీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు, బుర్ర లక్ష్మీరాజం గౌడ్ విగ్రహ ప్రతిష్ట

**గొల్లపల్లి ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):**



గొల్లపెల్లి మండలం రాఘవపట్నము గ్రామానికి చెందిన బుర్ర నర్సింగం గౌడ్ - బుచ్చవ్వ చిన్న కుమారుడైన బుర్ర లక్ష్మీరాజం గౌడ్ 09-02-1943వ సంవత్సరంలో జన్మించాడు. లక్ష్మిరాజం గౌడ్ చిన్నతనం నుంచి చదువుపై ఎంతో ఆసక్తి కనబరుస్తూ వృత్తి రీత్యా, వ్యక్తిత్వ రీత్యా, సం స్కార రీత్యా మహోన్నతుడు. పువ్వ పుట్టగానే పరిమళిస్తుందన్నట్టు చిన్నతనం నుంచి అసాధా రణ ప్ర్ష పాటవాలను ప్రదర్శించిన బుర్ర లక్ష్మీరాజం గౌడ్ ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి పలువురికి మార్గదర్శకంగా, తన వృత్తి ధర్మానికి మకుటంగా వెలిగారు. ఎందరో విద్యార్థులకు గురువుగా ఉపాధ్యాయవృత్తికే ఆదర్శంగా నిలిచిన ఆయన సాధారణ కుటుంబంలో జన్మించారు. విద్యార్థికి, ఉపాధ్యాయుడికీ మధ్య సంబంధం ఎలా ఉండాలో విడమరిచి చెప్పేవరు. ఉపాధ్యాయవృత్తికే ఆదర్శంగా నిలిచిన బుర్ర లక్ష్మిరాజం గౌడ్. ఆయన రాఘవపట్నం గ్రామానికి చెందిన వారు కావడం రాఘవపట్నం గ్రామ ప్రజలందరికీ గర్వకారణం. ఆయన కొన్ని దశాబ్దాల పాటు ఉపాధ్యా వృత్తిలో ఉండి విద్యార్థుల మధ్యనే గడిపారు. ఎదుటివారికి బోధించటం వల్ల తన విజ్ఞానం కూడా వృద్ధి చెందుతుందని మనసా వాచా నమ్మిన వ్యక్తి లక్ష్మిరాజం గౌడ్. కష్టమైన అంశాన్ని కూడా తన పాఠశాలలోని విద్యార్థులకు , తన సొంత గ్రామమైన రాఘవపట్నంలోని విద్యార్థులకు , గ్రామ ప్రజలకు అతి సులభంగా అర్థమయ్యే విధంగా జీవితంలో మంచి నడవడికను ఏర్పరచుకొని ఎలా ఎదగాలి , ప్రజలకు తమకు తోచినంత సహాయ సహకారాలు అందించాలని బోధించేవారాయన. గ్రామంలోని ప్రతి ఆలయ పూజా కార్యక్రమంలో చురుకుగా ముందుండి పాల్గొనేవారు. పాఠశాలలో సలహాదారునిగా, గ్రామపంచాయతీలో కో-ఆప్షన్ మెంబర్ గా సేవలు పలు సూచనలు అందించారు. ఉపాధ్యాయుడి బాధ్యత ఎప్పుడూ గురుతరమైనదే. అలాంటి బోధనావృత్తికి తలమానికంగా నిలిచిన బుర్ర లక్ష్మీరాజం గౌడ్ 22-08-2020 మరణించారు. తన విగ్రహ ప్రతిష్ట లో పాల్గొన్న గ్రామ పెద్దలు తను మరణించాడు అన్న విషయం ఇప్పటికీ నమ్మలేకపోతున్నామని మాలోనే ఒకరిగా కలిసిమెలిసి ఉంటూ తను చెప్పిన మంచి మాటలు గుర్తొస్తున్నాయని వాపోయారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు గ్రామ పెద్దలు ప్రజలు, విద్యార్థులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన కొత్తకొండ విద్యార్థులు

**భీమదేవరపల్లి ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):**



మండలంలోని కొత్తకొండ జిల్లా పరిషత్ పాఠశాలకి చెందిన విద్యార్థులు ఎం.డి. అఫ్రోజ్, ఓ. సాత్విక, వి. సౌజన్య లు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పిఈటి సునీల్ కుమార్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16 నుండి 19 వరకు సూర్యాపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ పోటీలకు హనుమకొండ జిల్లా నుండి ప్రాతినిత్యం వహిస్తారని తెలిపారు. ఈ ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. సునీత రాణి విద్యార్థులను అభినందించారు. వీరు రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభ చాటాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

## జ్యోతి హై స్కూల్ వార్షిక క్రీడా పోటీలు

**జగిత్యాల ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):**




పట్టణం లోనీ జ్యోతి హై స్కూల్ ఐఐటి అకాడమీ విద్యార్థులకూ స్థానిక గీత విద్యాలయం క్రీడ ప్రాంగణంలో జ్యోతి అన్యువల్ స్పోర్ట్ మీట్ -2024 పేరిట క్రీడ పోటీలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ బియ్యాల హరిచరణ్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమనికి జగిత్యాల జిల్లా ట్రస్మా అధ్యక్షులు బోయినపెల్లి శ్రీధర్ రావు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్న విద్యార్థులు ఒలంపిక్ క్రీడ జ్యోతి తో పరుగు తీసి పోటీలను ప్రారంభింప చేశారు. శాంతి కి చిహ్నం అయిన పావురాన్ని గాలి లోకి వదిలారు. అదే విధంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ మరియు ఒక్కో పాఠశాల ( హై స్కూల్ అండ్ ఐఐటి) లో గల 4 హౌస్ విద్యార్థుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. అదే విధంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు మానసిక, శారీరక ఉల్లాసం కోసం క్రీడలు ఎంతగానో దోహదపడతాయని అని అన్నారు. పాఠశాల డైరెక్టర్ బియ్యాల హరిచరణ్ రావు మాట్లాడుతూ. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా అన్యువల్ అథ్లెటిక్ మరియు స్పోర్ట్స్ మీట్స్ నిర్వహించాం అని అన్నారు. ఈ పోటీల్లో వివిధ రకాల క్రీడలు అనగా కబడ్డీ, కోకో ,బ్యాడ్మింటన్, డిస్కస్ త్రో, రన్నింగ్, టెన్నికాయిట్, లాంగ్ జంప్ , షాట్ పుట్, వాలీ బాల్ మొదలగు క్రీడలలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి , ప్రతిభావంతులను వెలికితీసుటకు పోటీలను నిర్వహించాం అని అన్నారు.అదే విధంగా తర్వాత జరిగే ముగింపు వేడుకల్లో విజేతలను ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రజిత ,అజిత ,ఉపాధ్యాయులు విద్యార్దులు తల్లి దండ్రులు పాల్గోన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14 జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు జ్యోతి పాఠశాల విద్యార్థి ఉడతలపల్లి గౌతమ్ రజిత పథకం సాధించిన సందర్భంగా పాఠశాల డైరెక్టర్ హరిచంద్ర రావు తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ సీఐ వేణుగోపాలరావు అభినందించి సత్కరించారు.

## క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న నిరుపేద వృద్ధురాలికి

**అండగా నిలిచిన ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్**

**కాటారం ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ఆదివారం పేట గ్రామానికి చెందిన ఆత్మూరి రామక్క గత రెండు సంవత్సరాల నుండి క్యాన్సర్ గడ్డల వ్యాధితో బాధపడుతుంది. పేదరికం వల్ల హాస్పటల్ కు వెళ్లలేక మంచానికే పరిమితమైంది. కనీసం ఉండడానికి ఇల్లు తినడానికి తిండి కూడా లేని పరిస్థితి ఆ వృద్ధురాలిది ఆమె భర్త కూడా 10 సంవత్సరాల క్రితంమే చనిపోవడంతో రామక్క పరిస్థితి చాలా దయనీయంగా మారింది ఈ విషయం తెలుసుకున్న ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి ఆ వృద్ధురాలికి నేనున్నాననే మనోధైర్యం చేపి పండ్లు మరియు 3000 వేల రూపాయల ఆర్థిక సాయం చేసి నిత్యవసర సరుకులు కూడా పంపిస్తానని అలాగే హాస్పటల్ కు తీసుకువెళ్లి ట్రీట్మెంట్ ఇప్పిస్తానని భరోసా ఇచ్చారు చైర్మన్ ఆయిలి మారుతి మాట్లాడుతూ....మీలాంటి పేదల కోసమే జయశంకర్ ఫౌండేషన్ నిరంతరం పనిచేస్తుందని ఆయన తెలియజేశారు.



ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసిన జగిత్యాల జిల్లాకు బదిలీ పై వచ్చిన డీఎస్పీ రఘు చందర్ శుక్రవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి ని హైదరాబాద్ లో మర్యాద పూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు.

prajamantalau daily pages (17-02-24)f_times of varha main (13-2).qxd 2/17/2024 12:37 AM Page 6



## సంద్రాల్లపల్లి పాఠశాలలో తైదల మనుశ్రీ పుట్టినరోజు వేడుకలు

కొడిమ్యాల ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని సంద్రాల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో తైదల మహేష్, స్రవంతిల కూతురు మనుశ్రీ ఐదవ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్స్, అరటి పండ్లు, బిస్కెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏనుగు ఆదిరెడ్డి, ఉపాద్యాయులు స్వర్ణ, గ్రామస్తులు, తల్లిదండ్రులు ఇత్నవేని మహేందర్, తైదల మహేష్ , స్రవంతి, కోలపురం బాబు, లక్ష్మీ, అర్ఎంపి శేఖర్, బసనవేనీ కరుణాకర్, అర్శం జలందర్, రేగుల సాగర్, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆటోవాలా బంద్ మహాలక్ష్మి పథకంతో ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లు

జగిత్యాల ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):



మహాలక్ష్మి పథకంతో ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్ లకు న్యాయం చేయాలనే డిమాండ్ తో రాష్ట్ర వ్యాప్తంగా యూనియన్ ఇచ్చిన పిలుపుమేరకు శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆటోవాలాలు బంద్ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు శెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఆటో డ్రైవర్ లను ఆదుకోవాలని, రవాణా రంగ కార్మికులకు సంక్షేమం కోరుతూ ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలనే డిమాండ్ తో బంద్ కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం తో నష్టపోతున్న ఆటో డ్రైవర్ లకు నెలకు రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిమాండ్ లు నెరవేర్చని పక్షంలో సమ్మె ఉధృతం చేస్తమని హెచ్చరించారు. అంతకు ముందు స్థానిక పాత బస్టాండ్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు.

## ముదిరాజ్ లను బీసీడీ నుంచి బీసీఏ లోకి మార్చండి

సికింద్రాబాద్ ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):



దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న ముదిరాజ్ కమ్యూనిటీ సమస్యలను వెంటనే తీర్చాలని కోరుతూ శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజా భవన్ లో నిర్వహించిన ప్రజాదర్బార్ లో సమర్పించిన వినతిపత్రంలో ముదిరాజ్ సంఘ నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్ ల సంక్షేమాన్ని గత ప్రభుత్వాలు గాలికొదిలేశాయని వారు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఎన్నికల మేనిఫెస్టో లో పేర్కొన్న విధంగా ముదిరాజ్ కమ్యూనిటీని బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలని అఖిల భారత ముదిరాజ్ సంఘ అద్యక్షులు పొట్లకాయల వెంకటేశ్వర్, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ రాజ్ లు వినతిపత్రంలో పేర్కొన్నారు.

## పిచర శ్రీ సమ్మక్క సారక్క దేవతలను దర్శించుకున్న కాంగ్రెస్ నాయకులు

వేలేర్ ఫిబ్రవరి 17 (ప్రజామంటలు):



వేలేరు మండలం పీచర మినీ మేడారం శ్రీ సమ్మక్కబిసారలమ్మ దేవతలను దర్శించుకున్న వేలేరు మండల కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, ఉమ్మడి ధర్మసాగర్ మండల మాజీ జడ్పిటీసీ కీర్తి వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా వన దేవతలను ప్రార్థిస్తూ మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఉండాలని మనస్ఫూర్తిగా అమ్మవార్లను వేడుకున్నారు. వారి వెంట పీచర కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మంతపురి రాజు,పూజారి కనుకయ్య, మ్యాకల యాదయ్య, ఆళ్ల రమేష్, ఓర్సు సమ్మయ్య, సోన్నాయిల రాజు తదితరులు ఉన్నారు.

## పల్లె ప్రకృతి వనాలను పరిశీలించిన ఎంపీడీవో

భీమదేవరపల్లి ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):

నూతనంగా ఎంపీడీవో బాధ్యతలు స్వీకరించిన నాగంపల్లి వీరేశం మండలంలోని మల్లారం, కొత్తకొండ, చంటయ్యపల్లి, ముత్తారం, వీర్లగడ్డతండా, రసూల్ పల్లె తదితర గ్రామాలలోని పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. రానున్న వేసవి దృష్ట్యా, గ్రామాల్లో మంచినీటి సౌకర్యానికి ఏలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ఉపాధి హామీ పనులను ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మాజీ సర్పంచ్ గుంటి ఓదెలు, ఎంపీఓ నాగరాజు, ఏపిఓ కుమారస్వామి, టిఏలు నాగరాజు, అశోక్, లావణ్య, రవి లతోపాటు పంచాయితీ కార్యదర్శులు అనిల్, వేణురెడ్డి తదితరులున్నారు.



# మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- ప్రతి మహిళా నైపుణ్యాభివృద్ధి సాధించాలి
- పట్టుదలతో లక్ష్యాన్నిఅందుకోవాలి
- టీ-లైఫ్ సంస్థ ప్రారంభోత్సవంలో జిల్లా కలెక్టర్ యాష్మీన్ భాషా

జగిత్యాల ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):



మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండి ముందుకు సాగాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాష్మీన్ భాషా సూచించారు. ప్రతి మహిళా వారికి నచ్చిన రంగంలో నైపుణ్యం పొందినప్పుడే ఆర్థికంగా ఎదుగవచ్చని కలెక్టర్ అన్నారు. మహిళలకు వివిధ రంగాల్లో శిక్షణ ఇప్పించేందుకు గాను జగిత్యాలలో టీ-లైఫ్ సంస్థ రాష్ట్ర ఆర్గనైజర్ తాటిపర్తి దీపికా రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన సంస్థ కార్యాలయాన్ని జిల్లా జడ్జి నిలిమా, జగిత్యాల డిఎస్పీ రఘుచందర్ లతో కలిసి కలెక్టర్ ప్రారబించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ సెల్ ఫోన్లలో మనం ప్రపంచాన్ని మన చేతుల్లోనే ఉన్న దాన్ని మంచికి ఉపయోగించడం లేదన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగినప్పటికి మన నడవడికలో మార్పు రాకపోవడం భాధకారమన్నారు. నాణ్యమైన వస్తువులకు మార్కెట్లో ధర ఎప్పుడు ఉంటుందని వాటిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి మహిళలో స్కిల్స్ ఉంటాయని వాటిని డెవలప్ చేసుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో డబ్బులు రెట్టింపు అని వచ్చే వదంతులను నమ్మవద్దని, ఎవరికి వారే తమకున్న పరిజ్ఞానంతో స్కిల్స్ డెవలప్ చేసుకోవాలన్నారు కలెక్టర్ సూచించారు. డబ్బులు రెట్టింపు చేస్తామని చెప్పే వారిపట్ల జాగ్రత్తగా ఉంటూ ఎవరిని గుడ్డిగా నమ్మవద్దని సూచించారు. కోవిడ్ వల్ల మంచి, చెడులు సమాజానికి తెలిశాయన్నారు. మెప్మా ద్వారా రుణాలు ఇస్తున్నామని వాటిని మహిళలు ఉపయోగించుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. మహిళలు వారు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే పట్టుదల, కృషి అవసరమన్నారు. ఆకాశంలో మహిళలు సగం అన్నారు. మహిళలు ఆర్థికంగా బాగుంటే కుటుంబం, సమాజం బాగుంటుందన్నారు. బ్యాంకులు సైతం మహిళల ఉపాధికోసం ఋణాలిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి మహిళ ఇతరులకు సహాయపడే విధంగా ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం ఆర్థికంగా బాగుపడుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. గతంలో ఉమ్మడి కుటుంబాలుండేవని,ఇంటి పెద్ద సలహా, సూచనలతోనే ఇంటిల్లిపాది నడుచుకునేవారని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ము0దుకు వచ్చి లీడర్ షిప్ అభివృద్ధి చేసుకోవాలని కలెక్టర్ మహిళలకు సూచించారు..మహిళలను ఎంటర్ ప్రైనర్ గాతయారు చేయాలనే లక్ష్యంతో టీ లైఫ్ సంస్థ ముందుకు నడుస్తుందని సంస్థ నిర్వహకులైన దీపికా రెడ్డి, శిరీషా రెడ్డి లను కలెక్టర్ అభినందించారు. జిల్లా జడ్జి నీలిమా మాట్లాడుతూ.... సమాజంలోని చెడును మేము చూస్తే జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు అభివృద్ధిని చూస్తారని పేర్కొన్నారు. మహిళల రక్షణకోసం చట్టాలు చేసిన సమాజంలో మహిళలకు అన్యాయం జరుగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నతనంలో భర్త చనిపోయిన భార్య పిల్లలను సన్మార్గంలో పెడుతూ ఉన్నత లక్ష్యాలకోస0 పాటుపడుతుందని పేర్కొన్నారు. ప్రతి మహిళా ఒక్క క్షణం ఆలోచిస్తే వరకట్న హత్యలుండవని అన్నారు. కుటుంబం కోసం నిరంతరం పాటుపడేది భార్య అయితే కుటుంబాన్ని సమాజంలో ఉన్నతంగా ఉంచడానికి భర్త కష్టపడుతారని నీలిమ అన్నారు. కుటుంబం బాగుపడాలంటే మహిళల బాధ్యత ముఖ్యమని చెబుతూ మహిళా లోకానికి సాయపడలనేదే టి లైఫ్ ఉద్దేశమని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే ముందుగా ఆర్థికంగా బాగుపడాలన్నారు. మహిళల్లో క్రైం రేట్ తగ్గించడానికి టి లైఫ్ సంస్థ ఉపయోగపడాలని జిల్లా జడ్జి నిలిమా అఖాంక్షించారు. టి లైఫ్ రాష్ట్ర ఆర్గనైజర్ దిపికారెడ్డి మాట్లాడుతూ.... మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదుగుతూ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని నిలబడినపుడే దేశం బాగుపడుతుందన్నారు. టి-లైఫ్ సంస్థ ఏర్పాటు, సంస్థ లక్ష్యాల గురించి ఆమే వివరించారు. డిఎస్పీ రఘు చందర్ మాట్లాడుతూ.... మహిళల భద్రత పట్ల పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు భరోసా కేంద్రాలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట్ రెడ్డి, మెప్మా అధికారి దుర్గపు శ్రీనివాస్ గౌడ్,డి ఆర్ డి ఓ, టిలైఫ్ జిల్లా ఆర్గనైజర్ పొన్నాల శిరీషా రెడ్డి, బొద్దు వనిత, లావణ్య, సమత, లావణ్య, మానస, మహిళా కాంగ్రెసు రాష్ట్ర కార్యదర్శి, మాజీ సర్పంచ్ తాటిపర్తి శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రథ సప్తమి వేడుకలు



కోరుట్ల ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):



తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆద్వర్యంలో కోరుట్ల పట్టణం, కల్లూర్ రోడ్ జిల్లా పరిషత్ హైస్కూల్ (బాలికల) లో రథ సప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని మనగుడి కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులచే సూర్య నమస్కారాలు చేయించారు. ప్రముఖ యోగా మాస్టర్ కస్తూరి రాజన్న యోగ, సూర్యనమస్కారాల విశిష్టతనుతెలియజేస్తూ ఆసనాలు వేయించారు. ఈ సందర్భంగా తి.తి.దే. హిందూ ధర్మ ప్రచార పరిషత్ జగిత్యాల జిల్లా కన్వీనర్ మంచాల జగన్ మాట్లాడుతూ.... ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్.. సర్వ జీవులకు ఆరోగ్యం ప్రాసాదించే వాడు సూర్యభగవానుడు. ఆయుష్షు బ్రహ్మదేవుని వల్ల, ఐశ్వర్యం శివుని వల్ల, సౌభాగ్యం జగన్మాతవల్ల, ఆరోగ్యం సూర్యునివల్ల కలుగుతాయీ అని నానుడి సూర్యుని కిరణ ప్రసరమే లేకుంటే శరీరం పని చేయదు. జీవరాశులేవీ పెరగవు అందుకే సూర్యునికి లోకబాంధవుడు అనే పేరువచ్చింది. సృష్టికంతటికీ నేత్ర స్వరూపుడు సూర్యుడు. జగత్తు సృష్టి స్థితి లయాలకు కారణభూతుడు ఆయనే. మూడు వేదాలే స్వరూపంగా కలవాడు. సత్త్వము, రజస్సు, తమోగుణములను ధరించిన వాడు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల స్వరూపం సూర్యభగవానుడే అని అన్నారు. అందుకే టి.టి.డి మన ఆచార సాంప్రదాయాలను భావితరాలకు అందించడానికి ఈ కార్యక్రమం చేపట్టింది అన్నారు. ముందుగా విద్యార్థిని విద్యార్థులచే ఆదిత్య హృదయం పారాయణం తెలుగు ఉపాధ్యాయులు శ్రీ కటుకోజ్వల మనోహరాచారి గారు చేయించి సూర్యభగవానునికి క్షీరాన్నం నివేదన చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ గడెల భూపతి,ఉపాధ్యాయులు చందా నాగరాజు, చింత మోహన్,చాప్ల లక్ష్మినారాయణ, గంగాధర్,సి.హెచ్.క్రిష్ణమోహన్ రావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. సుమారు 200 మంది విద్యార్థిని విద్యార్థులు సూర్య నమస్కారాలలో పాల్గొన్నారు.

## అంతర్జాతీయ క్రీడా పోటీలకు ఎంపికైన ప్రభును ఘన సన్మానం చేసిన టిజిపిఏ నాయకులు

జమ్మికుంట ఫిబ్రవరి 17 (ప్రజామంటలు):



ఇటీవల హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల లో 45 ప్లస్ విభాగంలో హైమర్ త్రోలో ద్వితీయ స్థానం పొంది వెండి పతకం అందుకున్న కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన అంబాల ప్రభాకర్ (ప్రభు) ను టిజిపిఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాష్ట్ర నిజ నిర్ధారణ కమిటి దార మధు ఆధ్వర్యంలో శుక్రవారం జమ్మికుంట లోని ప్రభు ఆర్ట్ గ్యాలరీలో ఘనంగా సన్మానించడం జరిగినది. టిజిపిఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు దార మధు మాట్లాడుతూ అంబాల ప్రభు ఒక సామాజిక కార్యకర్తగా, గొప్ప చిత్రకారుడిగా,ప్రపంచ గిన్నిస్ బుక్ రికార్డు సృష్టించిన డప్పు వాయిద్య కారునిగా, గాయకుడిగా, ఒక జర్నలిస్టుగా ఈ ప్రాంతంలో రెండు దశబ్దాలుగా ఈ ప్రాంతంలో అన్ని రంగాలలో అత్యంత ప్రతిభను కనబరిచి దళిత రత్న,నేషనల్ కళా రత్న అవార్డు గ్రహీతగా,నంది అవార్డు గ్రహీతగా అనేక అవార్డ్స్ అందుకోవడం ఈ నేల చేసుకున్న పుణ్యమే అని అభివర్ణించారు. అదే విధంగా అంబాల ప్రభాకర్ (ప్రభు) తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కావడం మా సంఘానికి గర్వకారణమని అన్నారు. అంతర్జాతీయ క్రీడా పోటీలు తైవాన్ దేశంలో జరిగే పోటీలలో కూడ తనదైన శైలిలో ప్రతిభను కనబరిచి ఈ దేశానికి గొప్ప పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిజిపిఏ జిల్లా ప్రధాన కార్యదర్శి దూడపాక శ్రీనివాస్,జిల్లా కోశాధికారి సదిరపు శంకర్, రవీందర్ లు పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవముల కరపత్ర ఆవిష్కరణ



జగిత్యాల ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):

అఖండ హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించిన మహా పోరాట యోధుడు, హిందూ ధర్మ సంరక్షకుడు అయిన ఛత్రపతి శివాజీ మహారాజ్ 397వ జయంతిని ఛత్రపతి యువసేన, కటికెవాడ, జగిత్యాల వారి ఆధ్వర్యములో నిర్వహించనున్నారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భముగా "హిందూ యువశక్తి శోభాయాత్ర (పాదయాత్ర)" ను ఈ నెల తేది 19 సోమవారము సా. గం. 4-30 ని. కు స్థానిక శ్రీ మడేళేశ్వర స్వామి దేవాలయము, మంచినీళ్ల బావి నుండి మొదలుకొని కటికెవాడ, తీనఖని చౌరస్తా, లడ్డు ఖాజా చౌరస్తా, టవర్ సర్కిల్, మార్కెట్, తహసీల్ చౌరస్తా, పాత బస్టాండ్ మీదుగా కాలేజిగ్రౌండ్ వరకు నిర్వహించబడును.కావున ఇట్టి కార్యక్రమములో హిందూ బంధువులందరూ అధిక సంఖ్యలో పాల్గొని శోభాయాత్రను విజయవంతం చేయగలరని ఆహ్వానిస్తున్నామన్నారు.

## రైతులు ప్రకటించిన గ్రామీణ భారత్ బంద్‌కు మద్దతుగా నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన ప్రదర్శన

భీమదేవరపల్లి ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):



కార్మికులు చేపట్టిన సంపూర్ణ సార్వత్రిక సమ్మె, దేశరాజధానిలో ఉద్యమం చేస్తున్న రైతులు ప్రకటించిన గ్రామీణ భారత్ బంద్ కు మద్దతుగా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భీమదేవరపల్లి మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనను చేపట్టారు. ఈ సంఘీభావ నిరసన ప్రదర్శనకు ముల్కనూరు ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో హాజరైన ఉపాధ్యాయ సంఘాల పోరాటకమిటీ రాష్ట్ర నాయకులు నన్నెబొయిన తిరుపతి, అటుకుల శ్రీనివాస రెడ్డి లు ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ, కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, రైతులకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని, విద్యుత్ చట్ట సవరణలు రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థలను అమ్మరాదని, సిపిఎస్ విధానాన్ని రద్దుచేయాలని, నూతన జాతీయ విద్యావిధానం ఉపసంహరించాలని, ఆదాయపన్ను స్లాబులు సవరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూఎస్ పిసి జిల్లా, మండల బాధ్యులు డి.రవీందర్, బి.అశోక్, కె.కొమురయ్య, బి.శ్రీదేవి, రవిప్రకాష్, చంద్రమౌళి, సురేష్ బాబు, పరమేశ్వర్, స్వరూప, సునంద, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులతో టచ్ లో ఉన్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు?

వేలేర్ ఫిబ్రవరి 17 (ప్రజామంటలు):

వేలేర్ మండల కేంద్రంలో మారుతున్న రాజకీయాలు, మండలంలో వచ్చే పార్లమెంట్ ఎలక్షన్ తర్వాత వచ్చే సర్పంచ్, ఎంపీటీసీ ,జడ్పిటిసి, ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ టికెట్ కావాలని కాంగ్రెస్ నాయకులతో టచ్ లో ఉన్నారని సమాచారం? ఒక కాంగ్రెస్ సీనియర్ నాయకుని దగ్గరకివెళ్ళి వచ్చే సర్పంచి ఎన్నికల్లో నాకు టికెట్ ఇవ్వాలని ఒక బి.ఆర్.ఎస్, పార్టీ నాయకుడు కోరారని సమాచారం? మండలంలో ఉన్న కార్యకర్తలతో ఒక సీనియర్ కాంగ్రెస్ పార్టీనాయకుడు పార్టీలో పనిచేసిన వారికే వచ్చే సర్పంచ్ ఎంపీటీసీ జడ్పిటిసి, ఎన్నికల్లో గుర్తింపు ఉంటదని అన్నట్టు సమాచారం?

## భూపాలపల్లి డిపిఆర్వోగా ఎస్. శ్రీనివాస్ రావు

భూపాలపల్లి జిల్లా ప్రతినిది ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):



భూపాలపల్లి జిల్లా పౌర సంబంధాల అధికారిగా ఎస్. శ్రీనివాస్ రావు ను నియమిస్తూ సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ఎం.హనుమంతు రావ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసారు. భూపాల్ పల్లి జిల్లా పౌర సంబంధాల అధికారిగా ఓ.డి పై విధులు నిర్వహిస్తున్న వి. శ్రీధర్ ను రాజన్న సిరిసిల్ల జిల్లాకు బదిలీ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఓ.డి. పై పనిచేస్తున్న పౌర సంబంధాల అధికారి ఎస్.శ్రీనివాస్ రావు ను తిరిగి భూపాలపల్లి జిల్లా డి.పి.ఆర్.ఓ గా కేటాయిస్తూ, వి. శ్రీధర్ ను బాధ్యతల నుంచి రిలీవ్ చేయాలని సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధం

జగిత్యాల ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):



జగిత్యాల పట్టణం మార్కండేయ దేవాలయ సమీపంలో శుక్రవారం ఉదయం షార్ట్ సర్క్యూట్ జగన్ అనే వ్యక్తికి చెందిన ఇల్లు దగ్ధం అయ్యింది. ప్రమాదం జరిగినప్పుడు ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో రూ.2 లక్షల ఆస్తి నష్టం జరిగిందని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

# సిఐటియు కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్

## పాల్గొన్న జిల్లా సహాయ కార్యదర్శి పుల్ల అశోక్

ఎల్కతుర్తి ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):




ఎల్కతుర్తి మండలం సెంటర్లో, దేశవ్యాప్త కార్మికుల సమ్మె - గ్రామీణ భారత్ బంద్ లో భాగంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు అంబాల స్వరూప, సిఐటియు మండల కన్వీనర్ వినవంక రమేష్ చారి ఆధ్వర్యంలో, సుందరయ్య నగర్ కాలనీ సెంటర్ నుండి, అంబేద్కర్ కూడలి వరకు, ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా, సిఐటియు, జిల్లా సహాయ కార్యదర్శి, పుల్ల అశోక్ రావడం జరిగింది, కాంటాక్ట్ విధానం రద్దు చేసి, కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, గ్యారంటీలతో కూడిన సేకరణలతో పాటు, అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర ఉండేలా, పేద మరియు, మధ్యతరగతి రైతులకు, కేంద్ర ప్రభుత్వం ఒకేసారి రుణమాఫీ చేయాలి, లేబర్ కోడ్స్ మరియు విద్యుత్ సావరన్న బిల్లు రద్దు చేయాలి, అట్టడుగు వర్గాలపై అణిచివేతను అరికట్టాలని, ప్రజా ఉద్యమకారులపై నిర్బంధాన్ని ఆపాలని ఆయన కోరారు, ఈ కార్యక్రమంలో, అంబాల మమత, గొల్లె రాదా, వసంత, ముద్రకోల యాదగిరి, రమ, రేణుక, షణ్ముఖం, సుబ్రహ్మణ్యం, శ్రీను, రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తిలో మంత్రి పొన్నం ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్

ఎల్కతుర్తి ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):



ఎల్కతుర్తి మండలంలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఈ.పీ.ఎల్. లో నేడు జరిగిన ఎల్కతుర్తి కాలనీ వర్సెస్ జగన్నాథ్ పూర్ మ్యాచ్లో ఎల్కతుర్తి కాలనీ టీమ్ ఘన విజయం సాధించారు, మంచి ప్రదర్శన చేసిన సాహు శనిగరపు కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు, ఆర్గనైజర్ అంబాల శ్రీకాంత్ అందజేశారు. సాహు మాట్లాడుతూ.... టీమ్ అందరు సహకారం వల్ల ఈ మ్యాచ్ విజయం సాధించాము. మరింత ఉత్సాహంతో రానున్న మ్యాచ్లో కూడా గెలిచి ఫైనల్ కీ చేరుతామని చెప్పారు. యువతను ప్రోత్సహిస్తూ క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజ్ చేసిన అంబాల శ్రీకాంత్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పైడిపల్లి కిరణ్, గోడిశాల వినయ్, అంబాలా కార్తీక్, అంబాల కిట్టు, దయాకర్, పుని, సతీష్, వంశీ, వినయ్, సాగర్, ప్రణయ, ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.

# మల్యాల సమ్మక్క సారక్క దేవతలను దర్శించుకున్న

## జడ్పీ చైర్మన్ కనుమల్ల విజయ

ఇల్లందకుంట ఫిబ్రవరి 17 (ప్రజామంటలు):

ఇల్లందకుంట మండలం మల్యాల మీని మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవతలను దర్శించుకున్న జడ్పీ చైర్మన్ కనుమల్ల విజయక్క. అలాగే సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద లైటింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వన దేవతలను ప్రార్థిస్తూ. జమ్మికుంట, ఇల్లందకుంట మండలం లోని అన్ని గ్రామాల ప్రజలు అమ్మవార్లను దర్శించుకోని సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవార్లను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ గురుకుంట్ల రాజీరు, అలాగే డైరెక్టర్లు, అరెల్లి తిరుపతి, కోరకండ్ల శ్రీనివాస్, దొరి గోవర్ధన్, గొర్రె అనిల్, గుడికందుల సంపత్, మురహరి గోపాల్, సిరిమల్ల మొగిళి, కారింగుల లక్ష్మణ్, తిరుపతి మొండయ్య, తదితరులు పాల్గొనడం జరిగింది.



# పేద ప్రజల గుడిసెలు కూల్చడం అమానుషం

- కోరుట్ల పట్టణంలో పేదల గుడిసెలపై రాష్ట్ర ప్రభుత్వ దౌర్జన్యం నశించాలి
- కూల్చిన గుడిసెలకు నష్ట పరిహారం చెల్లించాలి
- ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్
- అర్హులైన వారికి ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ, చేరుపల్లి సీతారాములు

కోరుట్ల ఫిబ్రవరి 16 (ప్రజామంటలు):



జగిత్యాల జిల్లా టి.అర్ నగర్ లో కోరుట్ల పట్టణంలో గత 6 నెలలుగా గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పెదలపై శుక్రవారం రోజున ఉదయం పోలీసులు దాడి చేసి, గుడిసెలను కూల్చివేయడాన్ని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు తీవ్రంగా ఖండించారు. సిపిఎం రాష్ట్ర బృందం కోరుట్ల పట్టణంలోని కూల్చివేసిన గుడిసెల స్థలాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా సీతారాములు మాట్లాడుతూ సర్వే నెంబర్ 923 గల 53 ఎకరాల భూమి లో 400 గుడిసెలు, దాదాపు లక్ష రూపాయలు ఖర్చు చేసి 80 పక్క ఇళ్ళు నిర్మించుకుని 6నెలలుగా పేదలు కార్మికులు నివాసం ఉంటూ పట్టాలివ్వలాని పోరాడుతున్నారు. 16వ తేది తెల్లవారు జామున 4గంల ప్రాంతంలో వందలది మంది పోలీసులు వచ్చి, బుల్డోజర్లతో గుడిసెలను కూల్చి, విలువైన వస్తువులు, గ్యాస్ సిలిండర్లు, కుట్టు మిషన్లు,,వంట సామాగ్రి తీసుకెళ్ళి పేద ప్రజలందరిని భయభ్రాంతులకు గురిచేశారు. దాడులు చేసి ముఖ్య నాయకులను అరెస్టు చేసి, వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. గత పాలకులకు ఈ పాలకులకు ఏమి తేడా లేకుండా ఉంది. ఈ రాష్ట్రంలో ఎమ్మెల్యే ఎంపీ లు ప్రభుత్వ భూములు చెరువులు కుంటలు కబ్జా చేస్తున్న వారిని అరెస్ట్ చేసి జైలు కు పంపకుండా చూసి చూడనట్లుగా వ్యవహరిస్తూ ఉన్నారని దుయ్య బట్టారు. పాలకులు దొంగలకు వత్తాసు పలుకుతూ ఉండడం సరైంది కాదన్నారు అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం.నేడు ఈ ప్రభుత్వ దమన ఖాండను తీవ్రంగా ఖండించారు. వెంటనే కూల్చిన ఇండ్ల స్థలాలోనే పేదలకు ఇంటినిర్మాణం చేసి, వాటికి పట్టాలు ఇవ్వాలి. ఇందిరమ్మ ఇళు మంజూరు చేయాలని అలాగే అక్రమంగా అరెస్టు చేసిన వారిని నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిపిఎం ష్ట కార్యదర్శి వర్గ సభ్యులు మల్లు లక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.అశయ్య, కరీంనగర్ సిపిఎం జిల్లా కార్యదర్శి వాసుదేవ రెడ్డి, ఐ.టీ.యు. రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, సిపిఎం జిల్లా నాయకులు చౌదరి,రమేష్, ఎండి సలీం, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్ 445 ఆలౌట్.. ఇంగ్లాండ్ 207/2

## బెన్ డక్కెట్ మెరుపు సెంచరీ

రాజ్ కోట్ టెస్టులో భారత్ నిలకడగా ఆడుతోంది. ఓవర్ నైట్ స్కోర్ 326 /5 రెండోరోజు ఆట కొనసాగించిన టీమిండియా ప్రారంభలోనే సెంచరీ హీరో జడేజా ( 112), నైట్ వాచ్ మన్ కులదీప్ యాదవ్ (4) వికెట్లు కోల్పోయింది. ఈ ఇద్దరూ జట్టు స్కోర్ 331 వద్దే అవుట్ అయ్యారు. తొలిరోజు 110 పరుగులతో క్రీజులో ఉన్న జడ్డూ మరో రెండు పరుగులు జోడించి పెవిలియన్ కు చేరాడు. ఒక పరుగుతో క్రీజులో ఉన్న కులదీప్ మరో 3 రన్స్ చేసి అవుట్ అయ్యాడు. దీంతో భారత్ 331 పరుగులకే 7 వికెట్లు కోల్పోయింది. జడేజాను తన బౌలింగ్ లోనే క్యాచ్ పట్టి రూట్ అవుట్ చేశాడు. కులదీప్ ను అండర్సన్ అవుట్ చేశాడు. ఈ దశలో రవిచంద్రన్ అశ్విన్, తొలి టెస్ట్ మ్యాచ్ ఆడుతున్న ధ్రువ్ జురెల్ పట్టుదలతో బ్యాటింగ్ చేశారు. దీంతో లంచ్ సమయానికి భారత్ 7 వికెట్ల నష్టానికి 388 పరుగులు చేసింది. లంచ్ సమయానికి ధ్రువ్ జురెల్ (31), అశ్విన్ (25) క్రీజులో ఉన్నారు. అప్పటికి 8వ వికెట్ కు 57 పరుగులు జోడించారు.అయితే లంచ్ తర్వాత కాసేపటి అశ్విన్ (37) రెహాన్ అహ్మద్ బౌలింగ్ లో అవుట్ అయ్యాడు. దీంతో 77 పరుగుల 8వ వికెట్ భాగ్యస్వామ్యానికి తెరపడింది. జట్టు స్కోర్ 408 పరుగుల వద్ద టీమిండియా 8వ వికెట్ కోల్పోయింది. తొలి మ్యాచ్ ఆడుతున్న ధ్రువ్ జురెల్ (46) హాఫ్ సెంచరీకి నాలుగు పరుగులు దూరంలో అవుట్ అయ్యాడు. దీంతో భారత్ 415 పరుగుల 9వ వికెట్ కోల్పోయింది. ఈ వికెట్ కూడా రెహాన్ అహ్మద్ కే దక్కింది.పదో వికెట్ కు బుమ్రా (26), సిరాజ్ (3 నాటౌట్) 30 పరుగులు జోడించారు. చివరి వికెట్ గా బుమ్రా అవుట్ కావడంతో టీమిండియా తొలి ఇన్నింగ్స్ 445 పరుగుల వద్ద ముగిసింది. ఇంగ్లాండ్ బౌలర్లలో మార్క్ వుడ్ కు 4 వికెట్లు దక్కాయి. రెహాన్ అహ్మద్ కు రెండు.. అండర్సన్, జోరూట్, టామ్ హర్ట్ లీకి తలో వికెట్ తీశారు. భారత్ బ్యాటర్లలో సర్ఫరాజ్ ఖాన్ రనౌట్ అయ్యాడు. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ ను దూకుడుగానే మొదలుపెట్టింది. బాజ్ బాల్ వ్యూహాన్ని అమలు చేసింది. ముఖ్యంగా బెన్ డక్కెట్ చెలరేగిపోయాడు. ఫోర్ల వర్షం కురిపించాడు. తొలి వికెట్ కు జాక్ క్రాలీ (15) తో కలిసి కేవలం 13.1 ఓవర్లలోనే 89 పరుగులు జోడించాడు.



జాక్ క్రాలీ అవుటైనా తర్వాత ఓలీ పోప్ తో కలిసి 93 పరుగలు జోడించాడు. పోప్ ను సిరాజ్ అవుట్ చేయడంతో ఇంగ్లాడ్ 182 పరుల వద్ద రెండో వికెట్ కోల్పోయింది. సెంచరీతో విధ్వంసం సృష్టించిన డక్కట్ (133 బ్యాటింగ్, 118 బంతుల్లో 21 ఫోర్లు, 2 సిక్సులు ) జోరూట్ (9 బ్యాటింగ్ ) మరో వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డారు. దీంతో రెండోరోజు ఆటముగిసే సరికి ఇంగ్లాండ్ కేవలం 35 ఓవర్లలోనే రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి 207 పరుగులు చేసింది.

# 500 వికెట్ల క్లబ్ లో రవిచంద్రన్ అశ్విన్

భారత్ స్పిన్నర్ మరో రికార్డు బద్దలు కొట్టాడు. టెస్టుల్లో 500 వికెట్లు తీశాడు. ఇంగ్లాండ్ బ్యాటర్ జాక్ క్రాలీ అవుట్ చేసి ఈ ఘనత సాధించాడు. 98వ టెస్టులో ఈ మైలురాయిని చేరుకున్నాడు. విశాఖ జరిగిన రెండో టెస్టులో అశ్విన్ ఈ ఘనత సాధిస్తాడని భావించారు. కానీ ఆ మ్యాచ్ ముగిసే సరికి 500 వికెట్లకు ఒక అడుగు దూరంలో నిలిచాడు. రాజ్ కోట్ వేదికగా జరుగుతున్న మూడో టెస్టులో ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ లో మొదటి వికెట్ ను పడగొట్టి అశ్విన్ అరుదైన ఘనతను అందుకున్నాడు. జాక్ క్రాలీ ఇచ్చిన క్యాచ్ రజత్ పటీదార్ పట్టుకోవడంతో అశ్విన్ ఆనందంతో గంతేశాడు. తక్కువ బంతుల్లో 500 వికెట్లు తీసిన బౌలర్ల జాబితా అశ్విన్ రెండోస్థానంలో నిలిచాడు. ఈ లిస్టులో ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ గ్లెన్ మెక్ గ్రాత్ టాప్ లో ఉన్నాడు. మెక్ గ్రాత్ 25, 528 బంతులు వేసి.. 500 వికెట్ల మార్కు అందుకున్నాడు. ఆ తర్వాత రెండోస్థాన్ భారత్ టాప్ స్పిన్నర్ అశ్విన్ నిలిచాడు. అశ్విన్ 25,714 బంతులు వేసి.. 500 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు.ఇంగ్లాండ్ వెటనర్ ఫాస్ట్ బౌలర్ల జేమ్స్ అండర్సన్ 28, 150 బంతుల్లో 500 వికెట్ల క్లబ్ లో చేరి 3వ స్థానంలో నిలిచాడు.. ఇంగ్లాండ్ కే చెందిన మరో ఫాస్ట్ బౌలర్ స్టువర్ట్ బ్రాడ్ 28,430 బంతుల్లో 500 వికెట్లు తీశాడు. వెస్టిండీస్ దిగ్గజ ఫాస్ట్ బౌలర్ కోట్నీ వాల్ష్ 500 వికెట్లు పడగొట్టడానికి 28, 833 బంతులు వేశాడు. టాప్ -5లోని ఉన్న బౌలర్లలో అశ్విన్ ఒక్కడే స్పిన్నర్. మెక్ గ్రాత్, అండర్సన్, బ్రాడ్, వాల్ష్ నలుగురు పేసర్లు. ఇలా అతి తక్కువ బంతుల్లో 500 వికెట్లు తీసిన స్పిన్నర్ గానూ అశ్విన్ మరో రికార్డు కూడా సృష్టించాడు.

# బ్యాటింగ్ ప్రారంభించకుండానే ఇంగ్లండ్‌కు 5 పరుగులు

రాజ్‌కోట్‌లోని నిరంజన్ షా స్టేడియంలో భారత్ -ఇంగ్లండ్ జట్ల మధ్య జరుగుతున్న మూడో టెస్టు మ్యాచ్ ఆసక్తికరంగా సాగుతోంది. మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియా 445 పరుగులకు ఆలౌటైంది. మూడో రోజు ఆటలో అరంగేట్రం ప్లేయర్ ధ్రువ్ జురైల్ 46 పరుగులు చేశాడు. . భారత జట్టు తరఫున ఈ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ రోహిత్ శర్మ అత్యధికంగా 135 పరుగులు చేయగా, రవీంద్ర జడేజా కూడా 112 పరుగులు చేశాడు. యువ సంచలనం సర్ఫరాజ్‌ఖాన్ కూడా అర్ధసెంచరీతో అకట్టుకున్నాడు. ఇంగ్లండ్ తరఫున పేసర్ మార్క్ వుడ్ అత్యధికంగా 4 వికెట్లు పడగొట్టాడు. ఇదిలా ఉంటే రాజ్ కోట్ రెండో రోజు రవిచంద్రన్ అశ్విన్ పెద్ద తప్పిదం చేశాడు. అతని తప్పిదం వల్ల ఇంగ్లండ్ బ్యాటింగ్ ప్రారంభించకముందే ఖాతా తెరిచింది. ఇంగ్లండ్ బ్యాటింగ్ 0కి బదులుగా 5 పరుగులతో ప్రారంభమైంది. వివరాల్లోకి వెళితే.. టీమ్ ఇండియా బ్యాటింగ్ ఇన్నింగ్స్ 102వ ఓవర్లో ఆర్. అశ్విన్ పెద్ద తప్పు చేశాడు. దీంతో ఇంగ్లండ్‌కు భారత జట్టు 5 పరుగులకే వదులుకోవాల్సి వచ్చింది. 102వ ఓవర్ వేయడానికి రెహాన్ అహ్మద్ వచ్చాడు. రెహాన్ వేసిన నాలుగో బంతికి అశ్విన్ ఒక పరుగు సాధించాడు. ఈ సందర్భంగా పిచ్ పై డేంజర్ జోన్‌లో అశ్విన్ పరుగెత్తాడు. నిబంధనల ప్రకారం పిచ్ డేంజర్ జోన్‌పై పరుగులు తీయకూడదు. దీంతో పిచ్ రూపు రేఖలు మారిపోతాయి. తొలిరోజు రవీంద్ర జడేజా కూడా ఇదే తప్పిదం చేశాడు. దీంతో అంపైర్ జడేజాను హెచ్చరించాడు. ఆ తర్వాత అశ్విన్ చేసిన అదే తప్పిదంతో అంపైర్ 5 పరుగుల జరిమానా విధించాడు. దీంతో అంపైర్ జోయెల్ విల్సన్ టీమ్ ఇండియాకు 5 పెనాల్టీ పరుగులు విధించాడు. ఇప్పుడు ఇంగ్లండ్ ఖాతాలో 5 పరుగులు చేరాయి. లా 41 ప్రకారం 2017 నుండి మేరీల్‌బోన్ క్రికెట్ క్లబ్‌కు లా 42 కింద జరిమానా టీమిండియాకు 5 పరుగుల పెనాల్టీ విధించారు.

# టెస్టుల్లో వేగంగా 32 సెంచరీలతో కేన్ విలియమ్సన్ చరిత్ర!

కేన్ మామ.. అంటే భారతీయులందరికీ సుపరిచితం. మ్యాచ్ ల్లో భావోద్వేగాలను బ్యాలన్స్ చేసుకుంటూ కూల్ కెప్టెన్ గా పేరు పొందిన న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ సెంచరీల మీద సెంచరీలు చేసి, అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు. సౌతఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్ట్ లో చేసిన సెంచరీతో అరుదైన ఘనతను సాధించాడు. టెస్టుల్లో వేగంగా 32 సెంచరీలు సాధించిన క్రికెటర్‌గా చరిత్ర సృష్టించాడు. 172 ఇన్నింగ్స్ లో ఈ ఘనత సాధించాడు. 267 పరుగుల లక్ష్యంతో ఛేజింగ్ ప్రారంభించిన న్యూజిలాండ్ జట్టులో కేన్ విలియమ్సన్ అద్భుత సెంచరీతో జట్టుని విజయం ముంగిట నిలిపాడు. 203 బంతుల ఎదుర్కొని 11 ఫోర్లు, 2 సిక్స్ ల సాయంతో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇక్కడ మరో అద్భుతం కూడా చెప్పాలి. గత 12 ఇన్నింగ్స్‌ల్లో విలియమ్సన్ ఏడు సెంచరీలు సాధించడం విశేషం. 33 ఏళ్ల విలియమ్సన్ అద్భుతమైన ఫామ్ తో చెలరేగిపోతున్నాడు. అంతేకాదు సౌతాఫ్రికాతో జరిగిన ఫస్ట్ టెస్ట్ లో రెండు ఇన్నింగ్స్ లో రెండు సెంచరీలు (118, 109) చేసి భళా అనిపించాడు. అంతకుముందు ఈ రికార్డు స్టీవ్ స్మిత్ పేరిట ఉండేది. స్మిత్ 174 ఇన్నింగ్స్‌ల్లో 32 సెంచరీలు సాధించాడు. తర్వాత రికీ పాంటింగ్ (176 ఇన్నింగ్స్), సచిన్ టెండూల్కర్ (179 ఇన్నింగ్స్), యునిస్ ఖాన్ (183 ఇన్నింగ్స్) ఉన్నారు. ఈ క్రమంలో విలియమ్సన్ వీరందరినీ దాటి ముందుకెళ్లాడు. అంతేకాదు టెస్టుల్లో నాలుగో ఇన్నింగ్స్‌లో అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాడిగా కూడా చరిత్ర సృష్టించాడు. కేన్ విలియమ్సన్ అన్ని ఫార్మాట్లలో కలిపి 45 సెంచరీలు చేశాడు. తన కంటే ముందు విరాట్ కోహ్లి (80), డేవిడ్ వార్నర్ (49), రోహిత్ శర్మ (47), జో రూట్ (46) మాత్రమే ఉన్నారు. అలాగే న్యూజిలాండ్ తరఫున టెస్టుల్లో అత్యధిక సెంచరీలు సాధించిన నెంబర్ వన్ బ్యాటర్ గా ఉన్నాడు. రాస్ టేలర్ 19 సెంచరీలతో రెండో స్థానంలో ఉన్నాడు.

# సర్ఫరాజుకి చేతులెత్తిదండం పెట్టిన జడేజా

రవీంద్ర జడేజా ఆటలో ఉంటే ఆ కిక్కే వేరుగా ఉంటుంది. సరదాగా నవ్విస్తుంటాడు. కవ్విస్తుంటాడు. జిమ్మిక్కులు చేస్తుంటాడు. ఫీల్డింగ్‌లో ఎంతో ఎనర్జటిక్‌గా ఉంటాడు. బెస్ట్ ఫీల్డర్ అవార్డులు ఎన్నో అందుకున్నాడు. ఒక ఆఫ్ సెంచరీ చేసినా, సెంచరీ చేసినా బ్యాట్‌తో కర్రసాము చేస్తుంటాడు. ఒకటి కాదు.. ఇలాంటివెన్నో.. తను మ్యాచ్‌లో ఉంటే మజాయే వేరుగా ఉంటుంది. కానీ ఈ సారి దానికి కంప్లీట్ రివర్స్ నడిచింది. ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో టెస్టు తొలిరోజు సెంచరీ చేసిన రవీంద్ర జడేజా ఆ ఆనందాన్ని అనుభవించలేకపోయాడు. అందుక్కారణం అద్భుతంగా ఆడుతున్న సర్ఫరాజ్ ఖాన్‌ని రన్ అవుట్ చేయడమే. నిజానికి గిల్, రజత్, యశస్వి అందరూ తడబడిన పిచ్‌పై తను అలవోకగా పరుగులు చేశాడు. ఫోర్లు, సిక్స్‌తో స్కోరుబోర్డుని పరుగులెత్తించాడు. అలాంటి సర్ఫరాజ్ మరికొంత సేపు క్రీజులో ఉంటే ఆట స్వరూపమే మారిపోయేది. అంతటి సువర్ణావకాశాన్ని రవీంద్ర జడేజా పాడు చేశాడని కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు అందరూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నెట్టింట కూడా తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలో ఇన్‌స్టాలో రవీంద్ర జడేజా ఒక పోస్ట్ పెట్టాడు. రెండు చేతులెత్తి నమస్కరించి, నా వల్ల పొరపాటు జరిగింది. నన్ను క్షమించు సర్ఫరాజ్ భయ్.. అంటూ రాసుకొచ్చాడు. ఇది నా తప్పిదమే. బాల్ ఫీల్డర్ చేతిలోకి వెళ్లింది లేనిది చూసిన తర్వాత రన్ చేయాల్సింది. కానీ క్విక్ సింగిల్ తీయాలని భావించి, పిలిచానని అన్నాడు. అయితే అద్భుతంగా ఆడుతున్న సర్ఫరాజ్‌ని అవుట్ చేయడంతో చాలా బాధనిపించిందని రాసుకొచ్చాడు.సర్ఫరాజ్ ఖాన్ రనౌట్‌గా వెనుదిరగడం చూసి అతని తండ్రి, భార్యతో పాటు రోహిత్ శర్మ కూడా తట్టుకోలేకపోయాడు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092, PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com